ప్రజాశక్తి

సోమవారం 3 జూన్ 2024 8 పేజీలు

ప్రకాశం బాపట్ల







మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

ఓట్ల లెక్కింపు ప్రక్రియలో

అప్రమత్తంగా ఉండాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం, అప్రమత్తత ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం స్థానిక ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఆదివారం జరిగింది. జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్.శ్రీధర్ పిపిటి ద్వారా అవగాహన కల్పిస్తూ శిక్షణ ఇచ్చారు. ముఖ్యఅతిథిగా జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్‌బాషా హాజరై.. మాట్లాడారు. ఓట్ల లెక్కింపు విధి నిర్వహణలో అధికారులకు స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. ఓట్ల లెక్కింపుపై ఎన్నికల కమిషన్ నిబంధనలను తప్పనిసరిగా అనుసరించాలన్నారు. సమస్యలు తలెత్తకుండా సమర్థతతో విధులు నిర్వహించాలన్నారు. ఈసీఐ మార్గదర్శకాలపై అవగాహన పొందాలని సూచించారు. నిర్దేశించిన సమయానికి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పించారు. విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది వారి వారి పరిధిని గుర్తుంచుకోవాలని, ఏ సమస్య వచ్చినా తక్షణమే ఆర్వోలను సంప్రదించాలన్నారు. ఈవీఎం కంట్రోల్ యూనిట్, ▶ 2లో

ఇక ఒక్క రోజే..

- కౌంట్ డౌన్ మొదలు..
- లెక్కింపునకు సిద్ధమవుతున్న యంత్రాంగం
- భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్న పోలీసుశాఖ



కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఇక ఒక్క రోజే మిగిలింది. ఫలితాల కోసం అందరూ ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. శనివారం సాయంత్రం విడుదలైన ఎగ్జిట్ ఫలితాలూ రాజకీయవర్గాల్లో చర్చకు దారితీస్తున్నాయి. రకరకాలుగా విశ్లేషణలు సాగుతున్నాయి. మంగళవారం నాడు ఈవీఎంలలో ఉన్న ఓట్లను లెక్కించే ప్రక్రియ ప్రారంభం కానుంది. అందుకోసం జిల్లా యంత్రాంగం పటిష్టమైన ఏర్పాట్లు చేస్తోంది.

పోటీ చేసిన ప్రధాన పార్టీల అభ్యర్థులు జిల్లాకు చేరుకున్నారు. నిన్నామొన్నటి వరకూ విశ్రాంతి పేరుతో ఇతర ప్రాంతాలకు తరలిపోయారు. నియోజకవర్గాలకు చేరుకుని కౌంటింగు ఏర్పాట్లలో ఉన్నారు. ఏజెంట్లను సిద్ధం చేస్తున్నారు. లెక్కింపు కేంద్రాల్లో ఎలా అప్రమత్తంగా ఉండాలన్నది ఇప్పటికే అభ్యర్థులకు పార్టీలు హితబోధ చేశాయి. ఏజెంట్లకు శిక్షణ ఇచ్చారు. అన్ని జాగ్రత్తలు చెబుతు న్నారు. ఎందుకంటే నువ్వా నేనా అన్నట్లుగా సాగిన పోలింగు వల్ల ఇప్పటికీ సరళి అభ్యర్థులకు పూర్తిగా అంతు చిక్కలేదు. అందుకే తక్కువ మెజార్టీలతో గెలుస్తామనే ధీమాలోనే ఉన్నారు. ఎవరికీ భారీ మెజార్టీ కనిపించడం లేదు. అందరూ పది వేల లోపే అంటున్నారు. ఇంకా చెప్పాలంటే వెయ్యి, రెండు వేల మెజార్టీతో గెలిచే స్థానాలూ చాలా కనిపిస్తున్నాయి. అందుకే అందరూ కౌంటింగు పైనే దృష్టిపెట్టారు. మరోవైపు తెలుగుదేశం నేతలు దామచర్ల జనార్ధన్ నేతృత్వంలో కలెక్టర్‌ను కలిసి కౌంటింగు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం ఇచ్చారు. లెక్కింపు ప్రక్రియను సజావుగా నిర్వహించా ల్సిన అవసరం యంత్రాంగంపై ఉంది. జిల్లాలో ఒంగోలు సమస్యాత్మక నియోజక వర్గంగా ఉంది. కౌంటింగుకు ముందే మాజీ మంత్రి బాలినేని, మాజీ ఎమ్మెల్యే దామచర్ల మధ్య మాటల యుద్ధం కూడా ఆరంభమైంది. కేసుల విషయంలో వీరిద్దరూ పరస్పర విమర్శలు చేసుకుంటున్నారు. ఇక జిల్లా అంతటా ఉత్కంఠగానే ఉంది. ఇద్దరు మంత్రులు జిల్లాలో కొండపి, సంతనూతలపాడు నుంచీ పోటీలో ఉన్నారు. ఇద్దరూ గతంలో గెలిచిన చోట నుంచి స్థానభ్రంశం అయిన సంగతి తెలిసిందే. కొత్త స్థానాల్లో వీరి భవితవ్యం ఎలా ఉంటుందనే దానిపై ఈ పాటికే చర్చ మొదలైంది. ఇక ఇప్పటికే వెల్లడైన ఎగ్జిట్‌పోల్స్ రాజకీయపార్టీల భవితవ్యం ఏమిటో తేటతెల్లం చేశాయి. అంతగా ప్రాచుర్యం లేని సంస్థలు అనేకం పార్టీల వారీగా చీలిపోయి ఫలితాలను వారికి మద్దతుగా ఉన్న పార్టీలకు అనుకూలంగా వెల్లడించాయి. జాతీయస్థాయి సంస్థలు ఎక్కువశాతం కూటమికే అధికారం అంటూ గణాంకాలు వెల్లడించాయి. వైసిపికి అనుకూలంగా రాష్ట్రంలో కొంత ప్రాచుర్యం ఉన్న ఆరా సంస్థ ఒక్కటే కనిపిస్తోంది. మిగతావన్నీ కూటమికి అనుకూలంగా ఓటర్ల తీర్పు ఉందని తేల్చాయి. దీంతో తెలుగుదేశం క్యాడర్‌లో జోష్ పెరిగింది. వైసిపిలో కొంత నైరాశ్యం కనిపిస్తున్నా పైకి గంభీరంగానే ఉన్నారు. ఏదేమైనా ఒక్క రోజు గడిస్తే అందరి భవిత్యాలూ తేలిపోనున్నాయి.

వడగండ్ల వాన

కంభం, పొదిలిలో భారీ వర్షం..



పొదిలిలో కురిసిన వర్షం

ప్రజాశక్తి-కంభం రూరల్, పొదిలి

కంభం పట్టణంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. అక్కడక్కడా వడగండ్లు పడ్డాయి. ఉధతంగా వీచిన ఈదురుగాలులకు జాతీయ రహదారిలోని 11 కెవి విద్యుత్ తీగలు తెగి కిందపడ్డాయి. కొన్ని గహాలలోని ఇన్వర్టర్లు డైరెక్ట్ అయిపోయినట్లు తెలిసింది. మరికొన్ని చోట్ల చెట్లకొమ్మలు సైతం విరిగిపడినట్లు సమాచారం. పట్టణంలోని నాయక్ వీధిలోని ఒక బిల్డింగ్‌పై పిడుగు పడి.. బిల్డింగ్ పైభాగంలోని పిట్టగోడ పాక్షికంగా దెబ్బతింది.

పొదిలి పట్టణంలో ఆదివారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. ఉరుములు, పిడుగులతో కురిసిన భారీవర్షానికి మురుగు కాలువలు పొంగి.. పట్టణంలోని ప్రధాన రహదారి మురుగునీటితో నిండిపోయింది. పట్టణంలోని వీధుల్లో మురుగు పొంగి ప్రవహించి.. పాదచారులకు తీవ్ర అసౌకర్యంగా మారింది. ప్రధాన రహదారిలో విశ్వనాథపురంలో ఇండేన్ గ్యాస్ కంపెనీ, ఆంజనేయస్వామి గుడిసెంటర్, ఉడుముల హస్పిటల్, తెలుగు బాప్టిస్టు చర్చి ఎదురుగా మాంసం దుకాణాల వద్ద, పాత పోస్టాఫీస్ సెంటర్‌లలో వర్షపు నీటితో పాటు మురుగునీరు చేరడంతో వాహనాల రాకపోకలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గత వారం రోజులుగా తీవ్ర ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు ఈ భారీవర్షం కొంత ఉపశమనం లభించిందని చెప్పొచ్చు.

విద్యుత్ ప్రైవేటీకరణకు బిజెపి కుట్ర

- కేంద్రంలోని బిజెపికి సహకరిస్తున్న వైసిపి, టిడిపి
- ఈ పాటికే స్మార్ట్‌మీటర్లకు జగన్ ప్రభుత్వం ఆమోదం
- వ్యవసాయ సంక్షోభ నివారణకు దేశవ్యాప్తంగా రుణమాఫీ చేయాలి
- రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య



మాట్లాడుతున్న వి.కృష్ణయ్య

ప్రజాశక్తి-ఇంకొల్లు

దేశవ్యాప్తంగా వివిధ రూపాల్లో రూ.70 లక్షల కోట్ల ఆస్తులున్న విద్యుత్ శాఖను రూ.ఏడు లక్షల కోట్ల అప్పులు సాకుగా చూపి ప్రైవేటీకరణ చేసేందుకు బిజెపి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వలేటి కృష్ణయ్య విమర్శించారు. మండలంలోని గంగవరంలో ఆదివారం నిర్వహించిన రైతుసంఘం మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మళ్లీ అధికారానికి వస్తే విద్యుత్ సంస్కరణలు వేగవంతం చేస్తుందన్నారు. విద్యుత్ శాఖను ముక్కలు చేసి తమకు అనుకూలమైన కార్పొరేటర్లకు అమ్మేసే దిశగా చట్టాలు చేస్తుందని అన్నారు. ఈ పాటికి వివిధ రాష్ట్రాల్లో స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో అధికారంలో ఉన్న జగన్ వైసీపీ ప్రభుత్వం స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుకు సిద్ధం చేసిందని అన్నారు. స్మార్ట్‌మీటర్ల వ్యవహారంలో ఈపాటికే ముఖ్యమంత్రికి రూ.కోట్లలో కమిషన్ అందిందన్నారు. ఈ కాంట్రాక్టు పని కూడా తమ బంధువులైన సాయి ఎలక్ట్రికల్స్‌కు అప్పజెప్పారని అన్నారు. వైసీపీ ప్రభుత్వంతో పాటు ప్రతిపక్ష టిడిపి కూడా పార్లమెంటులో విద్యుత్ శాఖ బిల్లులకు ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. రెండు పార్టీలు కేంద్రంలోని బిజెపి చేతిలో బొమ్మలుగా మారాయన్నారు. టిడిపి ప్రభుత్వం వచ్చినా కూడా కేంద్రం ఆధీనంలో విద్యుత్ ప్రైవేటీకరణకు చేతులు కలిపే పరిస్థితి ఉందని అన్నారు. ప్రధానమంత్రి మోడీ రైతు ప్రభుత్వమని, రైతులకు మేలు చేకూరే పథకాలు తమ హయాంలో చేపట్టామని మాటల్లో చెప్పుకుంటుందని, గతంలో ఢిల్లీలో రైతు సంఘాలు చేపట్టిన నిరసనలో రోజుల తరబడి రైతు సంఘాలు బంద్ చేయడంతో దిగివచ్చి చీకటి చట్టాలు రద్దు చేస్తానని ఒప్పుకొని, రద్దు చేయించి ఇప్పటికి రద్దు కార్యక్రమం చేపట్టకుండా మోసపూరితంగా వ్యవహరించారని ఆరోపించారు. రైతులను గౌరవించి ఇచ్చిన మాట ప్రకారం చీకటి చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు మేలు చేకూరే విధంగా ▶ 2లో

క్షణికావేశంలో కుమారుడినే కాల్చేశాడు..

ఏఆర్ కానిస్టేబుల్ ఆవేశానికి కొడుకు బలి!

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

క్షణికావేశానికి ఓ నిండు ప్రాణం బలైంది. కుమారుడు రూ.20 వేలు డబ్బులు ఇవ్వాలని అడిగిన సందర్భంగా ఏర్పడిన వివాదం నేపథ్యంలో ఓ ఏఆర్ కానిస్టేబుల్ తన కుమారుని తుపాకీతో కాల్చి చంపిన సంఘటన ఒంగోలులో సంచలనం కలిగించింది.



మృతిచెందిన ప్రసాద్‌బాబు

ఒంగోలు, భాగ్యనగర్ 4 వ లైన్‌లోని ఈవిఎం, వివిప్యాడ్స్ భద్రపరిచే రిజర్వ్‌డ్ గోదాం వద్ద కొదమల ప్రసాద్ బాబు(52)అనే ఏఆర్ కానిస్టేబుల్ గార్డ్ డ్యూటీ విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి ఒంగోలు శ్రీనివాస కాలనీ 1వ లైన్ ఇంటి వద్ద నుండి తన కుమారుడు కొదమల శేషు కమల్(20)తో కలసి బైక్ పై విధులకు వచ్చాడు. డ్యూటీ దగ్గర వదిలి పెట్టి వెళ్లే సమయంలో శేషు కమల్ తన తండ్రి ఈ నెల ఒకటిన జీతం డబ్బులు బ్యాంకు నుండి విత్ డ్రా చేయటంతో కుటుంబ అవసరాలకు ఇవ్వాలని అడిగాడు. దీంతో ప్రసాద్ బాబు ఇవ్వనని తేల్చిచెప్పాడు. డబ్బులు ఎందుకు అవసరమని ▶ 2లో

అభ్యర్థుల్లో పెరుగుతున్న ఉత్కంఠ

ప్రజాశక్తి-మార్కాపురం

ఎన్నికల ఫలితాల లెక్కింపు సమయం దగ్గర పడేకొద్దీ పోటీ చేసిన అభ్యర్థుల్లో ఉత్కంఠ పెరుగుతోంది. ప్రధాన పార్టీల నాయకులు, కార్యకర్తలు సైతం ఫలితాల కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఎవరు గెలుస్తారో... ఎవరు ఓడిపోతారో ఈ నెల 4వ తేదీన లెక్కింపులో తేలనుంది. మార్కాపురం నియోజకవర్గంలో వైసిపి-టిడిపిల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. కాంగ్రెస్ పార్టీ పోటీ నామమాత్రమే. ప్రధాన పార్టీలతో పాటు చిన్నా చితక పార్టీలు, స్వతంత్రులుగా మరో 25 మంది పోటీలో ఉన్నారు. పోటా పోటీగా ఓట్లను కొనుగోలు చేసింది కూడా వైసిపి-టిడిపిలు మాత్రమే. ఓటర్లను ఎన్ని రకాలుగా ప్రలోభాలకు గురి చేయాలో... అన్ని రకాలుగా ప్రలోభ పెట్టారు. వైసిపి మార్కాపురం పట్టణంలో, పొదిలి పట్టణంలో రూ.2 వేలు చొప్పున, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1500 చొప్పున ఓట్లను కొనుగోలు చేసినట్లు తెలిసింది. తెలుగుదేశం పార్టీ మాత్రం సగటున ఒక్కో ఓటు రూ.1500 చొప్పున కొనుగోలు చేయడం జరిగింది. మార్కాపురం నియోజకవర్గ వ్యాప్తంగా 2,14,608 ఓట్లు ఉండగా అందులో ప్రధాన పార్టీలు లక్షా యాభైవేల ఓట్లకు తగ్గకుండా కొనుగోలు చేసినట్లు సమాచారం. వైసిపి, టిడిపి నేతల వద్ద ఓట్లకు డబ్బు తీసుకున్న ఓటర్లు ఎవరికి ఓటు వేశారనేది ప్రశ్నార్థకంగా మారింది. కుటుంబంలో రెండు ఓట్లు ఉన్న వారు ఒకటి వైసిపి, మరొకటి టిడిపికి వేసినట్లు తెలుస్తోంది.



అన్నా రాంబాబు, కందుల నారాయణరెడ్డి

ఇద్దరి వద్ద డబ్బు తీసుకున్న వారు పై విధంగా ఇద్దరికీ న్యాయం చేసినట్లుగా ఓట్లు వేశారనే ప్రచారం జరుగుతోంది. మార్కాపురం నియోజకవర్గం వైసిపి అనుకూలంగా ఉంటుందనే గతంలో జరిగిన ఎన్నికలను బట్టి అర్థం చేసుకోవచ్చు. వైసిపి ఈ ఎన్నికల్లో కూడా మార్కాపురం నియోజకవర్గంలో గెలుపొంది హ్యాట్రిక్ సాధించాలనే ఆలోచనతో ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి టిడిపి ఓట్లను ఎవరు చీల్చగలరో గుర్తించి అందుకు తగిన అభ్యర్థులను మార్పు చేశారు. గిద్దలూరు ఎమ్మెల్యేగా ఉన్న అన్నా రాంబాబును మార్కాపురంలో వైసిపి అభ్యర్థిగా బరిలో నిలిపారు. మార్కాపురం నియోజకవర్గంలో ఆర్యవైశ్యులు గణనీయంగా టిడిపి వైపు ఉన్నారు. అదే సామాజికవర్గం నుంచి అన్నా రాంబాబును పోటీలో నిలపడంతో ఆయన సామాజికవర్గం నుంచి వైసిపికి ఓట్లు పడ్డాయని ఆ పార్టీ భావిస్తోంది. మార్కాపురం మున్సిపాలిటీలో టిడిపికి మెజార్టీ ఉండేది. ఈసారి అన్నా రాంబాబు కావడంతో వైసిపికి మెజార్టీ రానుందని ఆ పార్టీ నేతలు అంటున్నారు. టిడిపి ఓట్లకు భారీ గండి పడినట్లు ప్రచారం జరుగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఎలాగూ వైసిపికి పట్టుందని, అన్నా రాంబాబు 15వేలకు పైగా ఓట్ల మెజార్టీతో గెలుపొందుతారని వైసిపి శ్రేణులు ఘంటా పథంగా చెబుతున్నారు. ఫలితాల కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

టిడిపి తరపున కందుల నారాయణరెడ్డి పోటీ చేస్తున్నారు. ఆయన పలుమార్లు ఓటమి పాలయ్యారు. ఈ సారి సానుభూతితో పాటు ప్రభుత్వ వ్యతిరేకత గెలిపిస్తుందని టిడిపి నేతలు ధీమాగా ఉన్నారు. మార్కాపురం పట్టణంలో తమ మెజార్టీ తగ్గదని టిడిపి నేతలు అంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ ఓటు బ్యాంకు పెంచుకున్నామని చెబుతున్నారు. మార్కాపురం మున్సిపాలిటీ, మార్కాపురం మండలం, తర్లుపాడు మండలంలో టిడిపికి మెజార్టీ లభిస్తుందని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. కొనకనమిట్ల, పొదిలి మండలాల్లో వైసిపికి మెజార్టీ వచ్చినా పెద్దగా ఉండదని, టిడిపి తక్కువలో తక్కువన్నా 5వేల మెజార్టీతో గెలుస్తామనే ధీమాతో ఆ పార్టీ శ్రేణులు ఉన్నారు. ఎవరి ధీమా వారిదే అయినా... గెలుపెవరిదనేది ఈ నెల 4వ తేదీన తేటతెల్లం కానుంది. అప్పటి వరకు ప్రధాన రాజకీయ పార్టీల్లో ఉత్కంఠ అంతకంతకూ పెరుగుతూనే ఉంటుంది.

ఓట్ల లెక్కింపు ప్రక్రియలో అప్రమత్తంగా ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

పోస్టల్ బ్యాలెట్ లెక్కింపులో సమయపాలన పాటించాలన్నారు. పొరపాట్లు చేయవద్దని, మరింత అప్రమత్తంగా ఉండాలని పలు సూచనలు చేశారు. గుర్తింపు కార్డులు, విధులకు నియమిస్తూ జారీచేసిన ఆర్డర్ కాపీ ఉన్నవారినే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. కళాశాల వద్ద 100 మీటర్ల పరిధిలోపు వాహనాలకు అనుమతి లేదని అధికారులు, సిబ్బంది ముందస్తుగా అక్కడకు చేరుకోవాల్సి ఉంటుందన్నారు.

ఓట్ల లెక్కింపు ప్రక్రియ సమర్థంగా నిర్వహించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్.శ్రీధర్ తెలిపారు. విధి నిర్వహణలో అధికారులు మరింత చురుగ్గా పనిచేయాలని ఆదేశించారు. ఈవీఎం కంట్రోల్ యూనిట్లు, పోస్టల్ బ్యాలెట్ లు లెక్కించే సమయంలో పక్కాగా పరిశీలించాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల విధులలో చాలా అప్రమత్తత అవసరమన్నారు. నాలుగో తేదీన లెక్కింపు ప్రక్రియ ప్రారంభం నుంచి ముగిసే వరకు చేపట్టాల్సిన విధివిధానాలపై పిపిటి ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, ఆర్.ఓ.లు, శిక్షణ నోడల్ అధికారి ఏపీఎంఐపి పిడి బీవీ రమణ, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

క్షణికావేశంలో.. కుమారుడినే కాల్చేశాడు

(మొదటిపేజీ తరువాయి)

కుమారుడు శేషు కమల్‌తో ప్రసాద్‌బాబు వాగ్వివాదానికి దిగాడు. ఆ సమయంలో ప్రసాద్ బాబు మద్యం సేవించి ఉన్నాడు. డబ్బు విషయంలో ఇద్దరి మధ్య వివాదం నేపథ్యంలో ప్రసాద్‌బాబు కోపంతో సమీపంలోని గార్డు గదిలోకి వెళ్లి సర్వీస్ రైఫిల్ తీసుకొని రోడ్డుపై నిలబడి ఉన్న తన కొడుకును కాల్చాడు. సర్వీస్ రైఫిల్ లోడ్ చేసి మళ్లీ కాలుస్తానని చూపించారు. వెంటనే అక్కడ ఉన్న కానిస్టేబుల్స్ అప్రమత్తమై ప్రసాద్ బాబును పట్టుకొని ఆయుధాన్ని తీసుకొని ప్రమాదం జరగకుండా తప్పించారు. గాయపడిన శేషు కమల్‌ను అక్కడ సిబ్బంది చికిత్స కోసం ఒంగోలు రిమ్స్ లో చేర్పించగా వైద్యులు పరీక్షించి అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్ లో క్రైమ్ నెంబర్ 356/2024 ఐపిసి 302 సెక్షన్ 27 ఆయుధాల చట్టంలో కేసు నమోదు చేసి, ప్రసాద్ బాబును అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపారు. మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ శవ పంచనామాను పంచాయతీదారుల సమక్షంలో నిర్వహించి మృతదేహాన్ని శవపరీక్ష కోసం ఒంగోలు జిజిహెచ్‌కు తరలించారు. కొడమల ప్రసాద్‌బాబును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ ఘటన జరిగిన ప్రదేశం రిజర్వ్ గోడౌన్ కావడంతో ఆ స్థలంలో పోలింగ్ ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ బాక్సులు లేవన్నారు. రైజ్ ఇంజినీరింగ్ కళాశాలలోని ఈవీఎం స్ట్రాంగ్ రూమ్ కౌంటింగ్ కేంద్రం నుండి సంఘటన జరిగిన ప్రదేశం దాదాపు 9 కిలోమీటర్ల దూరంలో ఉందని తెలిపారు. తుపాకీతో కుమారుడిని కాల్చి చంపిన ఏఆర్ కానిస్టేబుల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలియజేశారు.

విద్యుత్ ప్రైవేటీకరణకు బిజెపి కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు వెంటనే అమలు చేయాలని కోరారు. ఆంధ్ర రాష్ట్రంతో పాటు దేశంలో వ్యవసాయం ప్రస్తుతం సంక్షోభం దిశగా ఉందని, రైతులు అప్పుల పాలయ్యారని అన్నారు. ఈ అప్పుల నుండి రైతులను తక్షణం ఆదుకునేందుకు దేశవ్యాప్తంగా రైతు రుణమాఫీ రాబోయే ప్రభుత్వం వెంటనే అమలుచేయాలని కోరారు. దీంతో రైతులకు కొంచెం ఊరట లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, సంఘం నాయకులు కందిమళ్ల రామకోటేశ్వరరావు, బొగ్గవరపు శంకర్రావు, యర్రం గోవిందరెడ్డి, ముప్పరాజు శ్రీనివాసబాబు, జరుగును హరిబాబు, మాదాల అంజయ్య, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

బాణసంచా అమ్మితే చర్యలు: ఎస్ఐ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలో జరుగనున్న కౌంటింగ్ నేపథ్యంలో వ్యాపారస్తులు ఎటువంటి బాణసంచా అమ్మరాదని యర్రగొండపాలెం ఎస్ఐ సుదర్శన్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా అమ్మకాలు జరిపితే కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కౌంటింగ్ అనంతరం విజయం సాధించిన అభ్యర్థులు, పార్టీల నాయకులు విజయోత్సవ ర్యాలీలు, సంబరాలు నిర్వహించుకునేందుకు ఎటువంటి అనుమతులూ లేవన్నారు. 144 సెక్షన్ అమలులో ఉందని అన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రజలు, రాజకీయ నాయకులు సహకరించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే రౌడీషీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు.



ఎస్ఐ సుదర్శన్

గ్రంథాలయంలో చదరంగం పోటీలు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల: పెద్దదోర్నాల శాఖా గ్రంథాలయంలో ఆదివారం గ్రంథపాలకుడు డి వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వేసవి శిక్షణా తరగతులను నిర్వహించారు. విద్యార్థులకు కథలు చదివించడం, కథలు చెప్పించడం, చదరంగం, డ్యాన్స్, ఇంగ్లీష్ గ్రామర్ తదితర అంశాలపై ఫ్యాకల్టీ వి శేషిరెడ్డి శిక్షణ ఇచ్చారు. చదరంగం పోటీలలో మొదటి బహుమతి ఎస్ వెంకట శివ, రెండో బహుమతి ఎల్ లోహిత్, మూడో బహుమతి ఎం హర్షద్ గెలుచుకున్నారు.



డికె శివకుమార్‌తో షేక్ మస్తాన్‌వలి, పీరయ్యగౌడ్

డీకే శివకుమార్‌ను కలిసిన షేక్ మస్తాన్‌వలి

ప్రజాశక్తి-గిద్దలూరు

కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌ను గిద్దలూరు కో-ఆప్షన్ సభ్యులు షేక్ మస్తాన్ వలి, పీరయ్యగౌడ్ ఆదివారం బెంగళూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీకే శివ కుమార్ వారితో మాట్లాడుతూ కుశల ప్రశ్నలు వేశారు. యోగక్షేమాలు విచారించారు.

మద్యం కోసం.. మందు బాబుల ఆరాటం

ప్రజాశక్తి-మార్కాపురం

ఓట్ల లెక్కింపు ఈ నెల 4వ తేదీన జరగనున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ముందుగా మద్యం దుకాణాలను మూసి వేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. దీంతో ఈ నెల 5వ తేదీ సాయంత్రం వరకు మద్యం అమ్మకాలు నిలిపివేయనున్నారు. ఆదివారం సాయంత్రంతో మద్యం అమ్మకాలు పూర్తిగా నిలిచిపోతాయని తెలుసుకున్న మందు బాబులు మద్యం దుకాణాల వద్ద బారులు తీరారు. మూడు రోజులకు సరిపడే విధంగా మద్యం కొనుగోలు చేశారు. ఎన్నికల ఫలితాలు వెలువడే సమయం కావడంతో మందు బాబులకు సహజంగానే మద్యంపై ఆసక్తి పెరుగుతుంది. గెలిచిన ఆనందంలో కొందరు... ఓడిన బాధలో మరికొందరు మద్యం తాగడమే పనిగా పెట్టుకుంటారు. మద్యం దుకాణాల వద్దకు మద్యం ప్రియులు అధిక సంఖ్యలో చేరుకోవడంతో మద్యం కొనుగోళ్లు పుంజుకున్నాయి. మధ్యాహ్నం సమయానికి స్టాక్ అయిపోయింది. మందుబాబులు అన్ని ప్రభుత్వ మద్యం దుకాణాల వద్ద క్యూలో నిలబడి మద్యం కొనుగోలు చేయడం విశేషం.



ఓ మద్యం దుకాణం వద్ద మందుబాబుల సందడి

చదువుల్లో, ఆటల్లో రాణిస్తూ..

- కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ఫలితాలు
- నేరేడుపల్లి జడ్‌పి హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ ఇదీ

ప్రజాశక్తి-పిసిపల్లి

ఆ పాఠశాల విద్యార్థులు చదువుతో పాట ఆటల్లోనూ రాణిస్తున్నారు. ఇతర పాఠశాలల విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఉపాధ్యాయుల కృషితో ఆటు చదువు లోనూ ఇటు ఆటల్లోనూ రాణిస్తున్నారు.చదువు, ఆటల్లో ప్రతిభ చూపుతున్న మండల పరిధిలోని నేరేడుపల్లి జడ్‌పి హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ గురించి ప్రత్యేక కథనం...

నేరేడుపల్లి జడ్‌పి హైస్కూల్ విద్యార్థులు తమ ప్రతిభ పాఠవాలతో కార్పొరేట్ పాఠశాలకు ధీటుగా చదువులో రాణిస్తున్నారు. ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. అందుకు తగ్గట్లుగా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ఈ ఎడాది 28 మంది విద్యార్థులు పది పరీక్షలు హాజరయ్యారు. అందరూ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. 11 మంది విద్యార్థులు 550కి పైగా మార్కులు సాధించారు. ప్రభుత్వం ప్రకటించిన 100 రోజుల ప్రణాళిక కంటే ముందుగానే ఉపాధ్యాయులు ఆగస్టు నుంచే ఉదయం 8.15 గంటలకు పాఠశాలలో స్టడీ అవర్స్ నిర్వహించారు. సాయంత్రం పూట 5 గంటల స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. చదువులో వెనుక బడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ స్లిప్ టెస్టులు నిర్వహించి విద్యార్థి సామర్థ్యాన్ని అంచనా వేస్తున్నారు. అందుకు తగినట్లుగా బోధన అందిస్తున్నారు.

ఆటల పోటీల్లో రాణింపు

నేరేడుపల్లి జడ్‌పి హైస్కూల్‌కు చెందిన జి. లావణ్య రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపింది. ఎన్.జాగృతి 400 మీటర్లు, 600 మీటర్లు పరురుగు పందెంలో పాల్గొని పత్రిభ చూపి రాష్ట్రస్థాయిలో మూడో స్థానంలో నిలిచింది.

విద్యార్థులకు ప్రోత్సాహ బహుమతులు

550 మార్కుల కంటే పైగా సాధించిన ప్రతి విద్యార్థికి రూ.5 వేల వంతున నగదు బహుమతి అందజేస్తామని గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి చాగంరెడ్డి కొండారెడ్డి ప్రోత్సహించారు. 10వ తరగతి విద్యార్థుల కోసం యుటిఎఫ్ తయారు చేసిన మెటీరియల్‌ను పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు ఎం.మోహన్‌రావు విద్యార్థులకు అందజేశారు. పాఠశాల తల్లిదండ్రులు కమిటీ ఛైర్మన్ గుజ్జుల రమణారెడ్డి, ఎలిమెంటరీ పాఠశాల ఛైర్మన్ పులి రవి విద్యార్థులకు అవసరమైన సామగ్రి అందజేశారు.



నేరేడుపల్లి జడ్‌పి ఉన్నత పాఠశాల

ఉత్తమ ఫలితాలే ధ్యేయం

టి.అంజనీదేవి, పాఠశాలప్రధానోపాధ్యాయురాలు



ఉత్తమ ఫలితాలే ధ్యేయంగా కృషి చేస్తున్నాం. అందుకు తగినట్లుగా ప్రణాళికలు సిద్ధం చేసి ఉపాధ్యాయులు బోధన అందిస్తున్నారు. విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల సహకారంతోనే ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నాం.

దాతలు ఆదుకోవాలి

గుండాబత్తుని లావణ్య,విద్యార్థిని



10వ తరగతి పరీక్షలు రాసిన తరువాత మా ఇంటిలో గ్యాస్ సిలిండర్ లీకై మంటలు చెలరేగాయి. మాది పూరిఇల్లు కావడంతో అది దగ్ధమైంది. కట్టు బట్టలతో మిగిలాం. తల్లిదండ్రులు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వ్యవసాయం కలిసి రాకపోవడంతో అప్పులు మిగిలాయి. మా తల్లిదండ్రులకు నన్ను చదివించే ఆర్థిక స్థోమత లేదు. దాతలు సహకరించి ఆర్థిక సాయం అందిస్తే బాగా చదివి సమాజాభివృద్ధికి కృషి చేస్తా.

స్టాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను అవుతా...

నేలపాటి సంజన, విద్యార్థిని



మా తల్లిదండ్రులు నారగ్నతమ్మ, సాంబయ్య కూలీ పనులు చేసి కుటుంబాన్ని పోషిస్తున్నారు. అమ్మమ్మ రావి గోవిందమ్మ వద్ద ఉండి చదువుకున్నా. భవిష్యత్తులో సాఫ్ట్‌వేర్ ఇంజినీరు కావాలన్నదే ధ్యేయం,

మాతల్లి రుణం తీర్చుకుంటా..

బోరెడ్డి గౌరీ, విద్యార్థిని



ఒకటో తరగతి చదువుతున్నప్పడే మా తండ్రి మాలకొండయ్య చనిపోయారు. ముగ్గురు ఆడ పిల్లలు మా తల్లి అంకమ్మకు భారం అయ్యాం. అయినప్పటికీ మా తల్లి కష్టడి చదివింది. భవిష్యత్తులో ఇంజినీర్‌ను అయ్యి మా తల్లి రుణం తీర్చుకుంటా.

మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఆదర్శం

కొత్తకోట నవ్యశ్రీ, విద్యార్థిని



మోక్షగుండం విశ్వేశ్వరయ్య నాకు ఆదర్శం. నదులు, ప్రాజెక్టులు, పెద్దపెద్ద భవనాలు కట్టించడమంటే నాకిష్టం. జిల్లాకు చెందిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య ప్రపంచంలోనే అగ్రగామి ఇంజనీర్ కావడంతో ఆయన్ని ఆదర్శం తీసుకున్నా. భవిష్యత్తులో ఇంజినీర్‌ను అయ్యి డ్యామ్‌లు కట్టాలన్నదే ధ్యేయం.

బాధితులకు మంత్రి సురేష్ పరామర్శ

ప్రజాశక్తి-జరుగుమల్లి

జరుగుమల్లికి చెందిన వైసిపి నాయకుడు దుంపా అనిల్ కుమార్ రెడ్డి తండ్రి దుంపా సుబ్బారెడ్డి ఇటీవల అస్వస్థతకు గురైయ్యారు. ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ విషయం గురించి తెలుసుకున్న మంత్రి సురేష్ సుబ్బారెడ్డిని ఆదివారం పరామర్శించారు. సుబ్బారెడ్డి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అదే విధంగా రోడ్డు ప్రమాదంలో గాయపడిన వైసిపి మండల కన్వీనర్ బత్తిన మదన మనోహరరావును వావిలేటిపాడులోని ఆయన నివాస గృహంలో మంత్రి పరామర్శించాడు. ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మంత్రి వెంట వైసిపి సీనియర్ నాయకుడు పిన్నిక శ్రీనివాసరావు, జరుగుమల్లి సర్పంచి కసుకుర్తి పున్నారావు, కనపర్తి శేషారెడ్డి, కొండూరి ప్రశాంతిరెడ్డి, హర్షవర్ధన రెడ్డి, హనుమారెడ్డి ఉన్నారు.

చిన్నారి అర్జున్‌కు ఆశీర్వాదం

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు మండలం నాయుడుపాలెం గ్రామానికి చెందిన దామచర్ల చెంచురామయ్య మనువడు అర్జున్ నూతన వస్త్రాల బహూకరణ వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ వేడుకల్లో టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య పాల్గొని చిన్నారి అర్జున్‌ను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో తూర్పునాయుడు పాలెం గ్రామ సర్పంచి తల్లపనేని రవికుమార్, వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

కొండపి : స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతుల ముగింపు సభ ఆదివారం నిర్వహించారు. ఈ సభలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.వెంకటేశ్వర్లు, డాక్టర్ ప్రణుత, యోగా శిక్షకులు శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రణుత మాట్లాడుతూ ఒత్తిడి లేని విద్యను నేర్చుకోవాలంటే ప్రతి విద్యార్థి తమకు ఇష్టమైన రంగాలను ఎంచుకోవాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.వెంకటేశ్వర్లు, కోర్స్ డైరెక్టర్ ఎల్‌వి.ప్రసాద్, విశ్వ నాగ బ్రహ్మ, అంబేద్కర్, దైవ కప, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత కోటి ఫ్రెండ్స్ జట్టు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు విద్యానగర్ వారి ఆధ్వర్యంలో జె వైఎస్, రాజేష్ ఫ్రెండ్స్ సహకారంతో సర్దార్ వల్లభాయ్ పటేల్ క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు ఉత్కంఠంగా సాగాయి. ఆదివారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో చీరాల కోటి ఫ్రెండ్స్, విద్యానగర్ సీనియర్స్ జట్లు తలపడ్డాయి. చీరాల కోటి ఫ్రెండ్స్ జట్టు విజేతగా నిలిచి రూ.40,116 నగదు బహుమతిని అందుకుంది. ఉప్పుగుండూరు విద్యానగర్ సీనియర్స్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి 30,116 నగదు బహుమతిని అందుకుంది. ఉప్పుగుండూరు 11 బుల్లెట్స్ జట్లు తృతీయ స్థానంలో నిలిచి రూ.20,116 , బూరేపల్లి యూత్ జట్టు నాల్గవ స్థానంలో నిలిచి రూ.10,116 నగదు బహుమతిని అందుకుంది. విజేతలకు విద్యానగర్ యూత్ మద్దిసాని నాగేశ్వరరావు, గద్దెల రాకేష్, గద్దల ఉదయ్ , గద్దె పెద్ద సుబ్బారావు, పైనం జయబాబు చేతులమీదుగా బహుమతులు అందించారు. బెస్ట్ బౌలర్ బాలగోపి కి తెలగతోటి చంద్రమోహన్ జ్ఞాపకార్థం వారి కుమారులు పధ్వి, గుణ రూ.5116 అందజేశారు. ఉత్తమ బ్యాట్ మెన్ బార్గవ్‌కు రూ. 5116 వేల్పుల నాగమల్లేశ్వరరావు అందజేశారు.ఈ కార్యక్రమంలో గద్దె శేషయ్య, నాగమల్లేశ్వరరావు , కామిశెట్టి నాగరాజు, గాలేటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న దాతలు


ఆత్మహత్యాయత్నానికి యత్నించిన మంజుల

కుటుంబ కలహాలతో యువతి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి- అద్దంకి

కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ యువతి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. ఈ ఘటన అద్దంకిలోని పాత శివాలయం సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామానికి చెందిన కుంచాల మంజుల తమ కుటుంబ సభ్యులతో కలిసి పాత శివాలయం సమీపంలో నివాసముంటోంది. ఈ క్రమంలో కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్తాపానికి గురైంది. హెయిర్ డైలో యాపిల్ జ్యూస్ కలుపుకొని తాగి అపస్మారక స్థితిలోకి వెల్లింది. గమనించిన స్థానికులు108 వాహన సిబ్బందికి సమాచారం అందించారు. 108 వాహన సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంజులను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎంఇఒ ఇంట్లో చోరీ రూ.లక్ష సొత్తు అపహరణ

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాలలో నివాసం ఉంటున్న త్రిపురాంతకం ఎంఇఒ తులపి మల్లికార్జున నాయక్ ఇంట్లో చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు రూ.లక్ష విలువైన బంగారం, నగదు అపహరించారు. అందిన వివరాల ప్రకారం... ఎంఇఒ తులపి మల్లికార్జున నాయక్ నాలుగు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లారు. గుర్తుతెలియని వ్యక్తులు సిసి కెమెరాలకు సంబంధించిన వైర్లను కట్ చేశాడు. అనంతరం ఇంటి వెనుక తలుపులను పగులగొట్టి లోనికి ప్రవేశించారు. బీరువాను పగులగొట్టి అందులో దాచిన బంగారు ఆభరణాలు, నగదును తీసుకెళ్లారు. తులసి మల్లికార్జున నాయక్ ఆదివారం ఊరు నుంచి ఇంటికి వచ్చాడు. తాళం తీసి ఇంట్లోకి వెళ్లగా వెనుక తలుపు తెరిచి ఉంది. అనుమానంతో బీరువాను పరిశీలించగా అందులోని నగదు, బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. . ఎస్ఐ అంకమరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.

ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-కంభం రూరల్

కారు, ఆర్‌టిసి బస్సు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని జంగంగుంట్ల గ్రామ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. క్షతగాత్రులను 108 వాహనంలో సౌతనిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనా కంభం ఎస్ఐ పులి రాజేష్ సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి144 సెక్షన్ అమలు

పిసిపల్లి : ఈనెల 4న సార్వత్రిక ఎన్నికల కౌటింగ్ సందర్భంగా పిసిపల్లి మండలంలో సోమవారం నుంచి బుధవారం 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఎస్ఐ టి. రమేష్ బాబు తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కౌటింగ్ అనంతంర బాణా సంచులు పేల్చడం, అనుమతులు లేకుండా ఊరేగింపులు నిర్వహించడం, అల్లర్లు సష్టించడం లాంటివి చేయరాదని తెలిపారు. ఎవరైనా చట్టం అతిక్రమిస్తే వారి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించాడు.

సముద్రతీరంలో పర్యాటకుల సందడి

◆ గతంలో సెలవు దినాల్లోనే పర్యాటకుల తాకిడి ◆ నేడు నిరంతరం పర్యాటకులతో కిక్కిరిసిన సూర్యలంక తీరం

ప్రజాశక్తి - బాపట్ల

మండలంలోని సూర్యలంక సముద్ర తీరం పర్యాటక జనంతో కిక్కిరిసిపోతోంది. మండే ఎండల్లో సైతం రెండు తెలుగు రాష్ట్రాల నుండి సముద్ర తీరంలో సేద తీరేందుకు పెద్ద ఎత్తున పర్యాటకులు వచ్చేస్తున్నారు. పాఠశాలలకు సెలవులు కావడంతో చిన్నారులతో కుటుంబ సమేతంగా అధిక శాతం పర్యాటకులు వస్తున్నారు. వారంలో ఐదు రోజులు ఇక్కడ పర్యాటకుల సందడి కనిపిస్తోంది. ఈనెల 12వరకు పర్యాటకుల తాకిడి అధికంగా ఉండవచ్చని భావిస్తున్నారు. సముద్రపు అలలు, కనువిందు చేసే కెరటాలు, సముద్ర తీరంలో ఆహ్లాదకరమైన వాతావరణం, చూడముచ్చటైన కమనీయ దృశ్యాల సమాహారంతో సూర్యలంక తీరం పర్యాటక జనావళికి మణిహారంగా విరాజుల్లుతోంది. పర్యాటకులకు ఇక్కడ అనేక వసతులు సమకూరడంతో ఇక్కడి తీరం ప్రాధాన్యత మరింత పెరిగింది. గతంలో సెలవు దినాల్లో అత్యధిక శాతం పర్యాటకులు కనిపించేవారు. ఇప్పుడు వారంలో ఐదు రోజులు పర్యాటకులతో సూర్యలంక తీరం సందడే సందడిగా కనిపిస్తోంది. హైదరాబాద్ నుండి పెద్ద ఎత్తున పర్యాటకులు సూర్యలంక తీరంలో సందడి చేస్తూ కనిపిస్తున్నారు. గతంలో పర్యాటకులకు అంతంత మాత్రంగా సౌకర్యాలు ఉండేవి. కొంతమంది తాజాగా సుందర తీరాన్ని తనివి తీరా తిలకించేలా ప్రత్యేక గుడారాలు, సేద తీరేందుకు ప్రైవేటు వ్యక్తులు వసతులు కల్పించారు. దీంతో ఈ సుందర తీరానికి మరింత ప్రాధాన్యత పెరిగింది.



గోవా తరహాలో సూర్యలంక సముద్ర తీరంలో సందడి చేస్తున్న పర్యాటకులు

రోహిణి కార్తె తర్వాత ఎండలు విపరీతంగా పెరిగిపోయాయి. అయినా ఇక్కడ పర్యాటక జన సంఖ్య మాత్రం తగ్గలేదు. రోజు రోజుకూ పెరుగుతూ వస్తుంది. చిన్నపిల్లలు ఉత్సాహంగా గడిపేలా రకరకాల సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రతిరోజు 10వేల మంది పైచిలుకు పర్యాటకులు వచ్చేస్తున్నారు. శని, ఆదివారాలు సెలవు దినాల్లో అయితే వేలాది మంది ఈ తీరానికి వస్తున్నారు. రోజు రోజుకు ప్రాధాన్యత పెరుగుతూ వస్తున్న బాపట్ల సూర్యలంక సముద్ర తీరంలో ప్రభుత్వం మరిన్ని వసతులు కల్పిస్తే ఎంతో వెసులుబాటుగా ఉంటుందని తెలంగాణ రాష్ట్రానికి చెందిన పలువురు పర్యాటకులు అన్నారు. సూర్యలంక తీరం ఎంతో ముచ్చట గొలిపేలా ఉందని, ఇక్కడ ఉన్న సదుపాయాల కంటే అధికంగా మరిన్ని సదుపాయాలు కల్పిస్తే భారతదేశంలోనే సూర్యలంక మరో గోవా కంటే అంద అందమైన పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకొని పర్యాటకులతో ప్రతినిత్యం సందడి చేసే అవకాశాలు ఉన్నాయని సుదూర ప్రాంతాల నుండి సూర్యలంకకు వచ్చే పర్యాటకులు కోరుతున్నారు.



పరామర్శిస్తున్న ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్

పలువురికి గొట్టిపాటి పరామర్శ

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని తిమ్మాయపాలెంకు చెందిన కల్లూరి లక్ష్మణరావు, జె పంగులూరు మండలం కొండమంజులూరుకు చెందిన చింతల బాపనయ్య చౌదరి నిర్యాణ కార్యక్రమాలకు ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్ హాజరై వారి చిత్రపటాలకు నివాళి అర్పించారు. కొరిశపాడు మండలం మేదరమెట్ల ఎస్టీ కాలనీకి చెందిన టిడిపి కార్యకర్త చేవూరి తిరుపతిరావు రోడ్డు ప్రమాదంలో గాయపడి కాలికి శస్త్రచికిత్స చేయించుకోగా ఆయనను పరామర్శించారు. మేదరమెట్లలో కూరగాయల సింగయ్య మనవడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కాలికి శస్త్రచికిత్స చేయించుకోగా పరామర్శించి ప్రమాదానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. బల్లికురవ మండలం కొప్పెరపాడుకు చెందిన పందిరి పిచ్చయ్య (46) రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా శవ పరీక్ష నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా పిచ్చయ్య భౌతికకాయానికి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.



దుగ్గిరాల విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నిర్వాహకులు

దుగ్గిరాలకు ఘన నివాళి

ప్రజాశక్తి - బాపట్ల

చీరాల –పేరాల ఉద్యమం ద్వారా ఈ ప్రాంతానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన దుగ్గిరాల గోపాలకృష్ణయ్య చిరస్మరణీయులని ఫోరం ఫర్ బెటర్ కార్యదర్శి పిసి సాయిబాబు అన్నారు. దుగ్గిరాల గోపాలకృష్ణయ్య 135వ జయంతి సందర్భంగా ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో ఆంధ్రరత్న మార్గ్‌లో తహశీల్దారు కార్యాలయం వద్దగల దుగ్గిరాల విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈసందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ పన్నుల నిరాకరణకు 11నెలల పాటు చీరాల – పేరాల ప్రజలను ఏకతాటిపై నడిపించారని అన్నారు. అఖిలభారత కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా పనిచేసిన తొలి ఆంధ్రుడు దుగ్గిరాల గోపాల కృష్ణయ్యని అన్నారు. దుగ్గిరాల గోపాలకృష్ణయ్య బాపట్ల బోర్డు స్కూల్లో విద్యాభ్యాసం చేయడం, బాపట్ల తాలూకా ఆఫీసులో ఉద్యోగం చేయడం బాపట్ల వాసులకు గర్వకారణమని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎం యల్లమంద, న్యాయవాది జమృద్ బాషా, కరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ రమేష్

పర్చూరులో వాహనాలు తనిఖీ

ప్రజాశక్తి - పర్చూరు

ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ఎస్ఐ ఎస్ రమేష్ ఆదివారం నాకాబందీ నిర్వహించారు. రోడ్లపైకి వచ్చిన ప్రతి వాహనాన్ని నిలిపి వాహన ధ్రువ పత్రాలు తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని 6 ద్విచక్ర వాహనాలు, ఒక ఇన్నోవ కారును సీజ్ చేశారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా అనుమానితులు, అసాంఘిక శక్తుల కదలికలను కట్టడి చేయటానికి వాహనాల తనిఖీ చేపట్టామని తెలిపారు.

రైతు సంఘాలు పటిష్టంగా ఉండాలి

రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు

ప్రజాశక్తి - ఇంకొల్లు

గ్రామ స్థాయిలో రైతు సంఘం కమిటీ పటిష్టంగా ఉండాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు అన్నారు. మండలంలోని గంగవరంలో మంచా ల వెంకట్రామయ్య, వెంకటరంగమ్మ విద్యా, వైజ్ఞాన కళ్యాణ వేదిక మండపంలో బెల్లం సుభాష్ పంచల బహుకరణలో పాల్గొన్న అనంతరం రైతు సంఘం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షు డు వలేటి కృష్ణయ్య మాట్లాడారు. సమావేశానికి బొగ్గవరపు శంకరరావు అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం ఉమ్మడి ప్రకాశం జిల్లా రైతు సంఘం మాజీ అధ్యక్షులు కందిమల్ల రామకోటేశ్వరరావు మాట్లాడారు. ఈ నెల 15లోపు రైతు సంఘం గ్రామ కమిటీలు చురుగ్గా సభ్యత్వం నమోదు చేయాలని అన్నారు. రైతు వాణి పుస్త కాల సంవత్సర చందాలు కట్టించాలని కోరారు. సందర్భం గా రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వలేటి కృష్ణయ్య మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులకున్న సమస్యలను రైతు సంఘం సభ్యులను అడిగి తెలుసు కున్నారు. రాబోయే రోజుల్లో రైతు సమస్యలపై పోరాటాల కు కృషిచేయాలని అన్నారు. ఓట్ల లెక్కింపు సమయం ముగిసిన అనంతరం ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ పంట నష్ట పరిహారంపై పోరాటం చేయాలని సూచించారు. తుఫాను సందర్భంగా నష్ట పోయిన రైతులకు మేలు చేయాలని అన్నారు. వ్యవసాయ సంక్షోభ సమస్యలు, పాడి సమస్యలు, విత్తనాలు, భూసార పరీక్ష సమస్యలు, నకిలీ ఎరువులు, విత్తనాలు సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు.



మాట్లాడుతున్న అనగాని సత్యప్రసాద్

ఎన్నికల్లో కూటమిదే అధికారం

ప్రజాశక్తి - రేపల్లె

రాష్ట్రంలో టీడీపీ కూటమి ఘన విజయం సాధిస్తుందని, మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ అంచనా తమకే అనుకూలంగా ఉన్నాయని టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రాబోతుందని అన్నారు. జాతీయ స్థాయి సర్వే సంస్థల్లో అత్యధికం ఫలితాలు కూటమికే మొగ్గు ఉన్నట్లు వచ్చిందని అన్నారు. అత్యధిక మెజారిటీతో తాను గెలవబోతున్నట్లు ధీమా వ్యక్తం చేసారు. ఓట్ల లెక్కింపులో దౌర్జన్యాలు జరిగే అవకాశం ఉన్నందున నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించాలని అన్నారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యి, డిక్లరేషన్ తీసుకునే వరకూ ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రం నుంచి బయటకు రావద్దని సూచించారు. జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపులో అల్లర్లు జరిగే అవకాశం ఉన్నదని, ఎటువంటి అల్లర్లు జరగకుండా జిల్లా పోలీసులు చూస్తారనే నమ్మకం పూర్తిగా ఉందన్నారు.

అందమైన చిత్రాలకు సాంకేతికత జోడించాలి

ప్రజాశక్తి - బాపట్ల

ఆధునిక సాంకేతికతతో అందమైన ఛాయా చిత్రాలకు జీవం పోయాలని ప్రముఖ ఫోటోగ్రఫీ ఫ్యాకల్టీలు కౌశల్ సోనీ, ఈగ రవీంద్ర అన్నారు. మండలంలోని ముత్తాయపాలెం గ్రామానికి చెందిన ఉత్తమ ఫోటోగ్రాఫర్స్ అవార్డు గ్రహీత పివిఎస్ నాగరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫోటో ఎడిటింగ్ వర్క్ షాపుకు కౌశల్ సోని, ఈగ రవీంద్ర ఫ్యాకల్టీలుగా వ్యవహరించారు. ఫోటోగ్రఫీకి సంబంధించి శరవేగంతో పరుగులు తీస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి నూతన సాఫ్ట్ వేర్ వినియోగంతో అందమైన చిత్రాలకు ఆకృతి కల్పించే విధంగా తీసుకోవలసిన పరిజ్ఞానాన్ని యువ ఫోటో గ్రాఫర్లకు వివరించారు. ఫోటో ఆల్బమ్ డిజైన్, ప్రింటింగ్, ఛాయాచిత్రాలను పదిల పర్చుకునే అంశాలపై ఫోటోగ్రాఫర్లకు సూచనలు చేశారు. ఫోటోగ్రఫీని భావితరాలకు అందించేందుకు పివిఎస్ నాగరాజు చేస్తున్న కృషిని అభినందించారు. వర్క్ షాపులో పాల్గొన్న ఫోటోగ్రాఫర్లకు ప్రశంసా పత్రాలు అందజేశారు. వర్క్ షాపులో రెండు తెలుగు రాష్ట్రాల ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు.



ఫోటోగ్రాఫర్‌కు ప్రశంసా పత్రం అందిస్తున్న నిర్వాహకులు



అన్నదానం ప్రారంభిస్తున్న మోపిదేవి వెంకటరమణ

అన్నదానం ప్రారంభం

ప్రజాశక్తి - నిజాంపట్నం

గ్రామ దేవత, మత్స్యకారుల ఇలవేల్పు శ్రీ మొగదారమ్మ తల్లి సిడిమాను మహెూత్సవం సందర్భంగా రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు, వైసీపీ నాయకులు మోపిదేవి హరినాథ్ బాబు సహాయ, సహకారాలతో ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానం ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు హరనాథ్ బాబు, ఆలయ కమిటీ చైర్మన్ కన్నా శీను, బోటు యూనియన్ ప్రెసిడెంట్ మోపిదేవి శ్రీనివాసరావు, నగరం ఎంపీపీ చింతల శ్రీ కృష్ణయ్య, ప్రసాదం వాసుదేవ, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

ప్రజాశక్తి - నిజాంపట్నం

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని శాఖ గ్రంథాలయ అధికారిణి ఎన్ విజయలక్ష్మి తెలిపారు. వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా ఆదివారం స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ క్లాసులు, లెమన్ స్పూన్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. విద్యార్థులు వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని పరిజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. విద్యార్థులు చదువుతోపాటు విజ్ఞాన నైపుణ్యాన్ని పెంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ మెంబర్స్ కొల్లిపర శ్రీనివాసరావు, షేక్ తాజుద్దీన్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

వేట లేక.. భరోసా అందక..

- పూట గడవక మత్స్యకారుల ఇక్కట్లు

ప్రజాశక్తి-శింగరాయకొండ

సముద్రంలో వేట నిషేధం అమలులో ఉండటంతో మత్స్యకారులకు కష్టాలు తప్పడం లేదు. వేట లేక పూట గడవక అవస్థలకు గురువుతున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో మత్స్యకార భరోసాపై సమాధానం చెప్పేవారే లేరని మత్స్యకారులు వాపోతున్నారు. సముద్రంలో చేపలు గుడ్డపెట్టే సమయం కావడంతో 15-4 -2024 నుంచి 14 -6- 2024 వరకూ 61 రోజుల పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సముద్రంలో వేట నిషేధం అమలు చేస్తున్నాయి. నిషేధ సమయంలో సముద్రంలోకి వేటకు వెళ్లితే కఠిన శిక్ష తప్పదని హెచ్చరికలు చేశారు. కోస్ట్‌గార్డ్ , మెరైన్ పోలీసుల సహకారంతో సముద్రంలో వేటను నిషేధించారు. వేట నిషేధ సమయంలో మత్స్యకారులు వేటకు వెళ్లకుండా ఉంటే ఆ బోటు పై ఆధారపడిన కుటుంబాలకు రూ.10 వేల చొప్పున ప్రభుత్వం మత్స్యకార భరోసా అందజేస్తుంది. గతంలో టిడిపి ప్రభుత్వం హయాంలో నగదుతో పాటు, బియ్యం కూడా అందజేసేవారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత భరోసా కింద రూ.10 వేలు మాత్రమే అందజేస్తున్నారు. ప్రకాశం జిల్లాలో సముద్ర తీర ప్రాంతం 52 కిలోమీటర్లు పొడవున ఉంది. ఒంగోలు, కొత్తపట్నం, నాగులుప్పలపాడు, టంగుటూరు శింగరాయకొండ మండలాలు సముద్ర తీర ప్రాంతం వెంబడి ఉన్నాయి. సుమారు 32 వేలకు పైగా మత్స్యకార కుటుంబాలు ఈ గ్రామాల్లో ఉన్నారు. ఐదు మండలాల్లో 14 పంచాయతీ పరిధిలో 30 గ్రామాల్లో మత్స్యకారులు జీవనం సాగిస్తున్నారు. 1200 బోట్లు సముద్రంలోకి వేట సాగిస్తుంటాయి. ఒక్కొక్క బోటుపై పదిమంది చొప్పున సముద్రంలో వేటకు వెళ్లి మత్స్య సంపదపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వేట నిషేధ సమయంలో నగదు అందించాల్సిన ప్రభుత్వాలు మత్స్యకారులు ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. నగదు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో వేస్తున్నారు. లోన్లు రుణాలు ఉన్నాయంటూ బ్యాంకర్లు ఆ నగదును జమ చేసుకుంటున్నారు. కొందరిని బ్యాంకు ఖాతాలకు ఆధార్ కార్డు లింకు పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారు .కొందరి బ్యాంకు ఖతా రన్నింగ్ లేదని నగదు జమ కావడం లేదు. దీంతో భరోసా అందక వారు అవస్థలకు గురవుతున్నారు. మత్స్య శాఖ అధికారులు తమ సిబ్బందితో సముద్ర తీర ప్రాంతంలోని బోట్లు వద్దకు వెళ్లి ఇప్పటికే సర్వే పూర్తి చేశారు. సర్వే పూర్తి చేసిన తర్వాత డబ్బులు ఎప్పుడొస్తాయనే విషయాన్ని మాత్రం మత్స్యశాఖ అధికారులు చెప్పే పరిస్థితి లేదు. వేట లేక చేసే పని లేక సముద్ర తీర ప్రాంతం వద్దే ఉంది వలలు, బోట్లకు మరమ్మతులు చేసుకుంటున్నారు. ఈనెల 14 నుంచి వేట ప్రారంభం కానున్న నేపథ్యంలో మత్స్యకార భరోసా తక్షణమే అందజేయాలని మత్స్యకారులు కోరుతున్నారు.



వలలకు మరమ్మతులు చేసుకుంటునన మత్స్యకారులు

వేగంగా నడికుడి - కాళహస్తి రైల్వేలైన్ పనులు

- దర్శి వరకూ పూర్తయిన మొదటి ట్రాక్ పనులు

ప్రజాశక్తి-దర్శి

నడికుడి -కాళహస్తి రైల్వే లైన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. దర్శి వరకూ మొదటి లైన్, బుకింగ్ కార్యాలయ భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. దీంతో నడికుడి నుంచి దర్శి వరకూ ట్రయల్ నిర్వహించారు. దర్శిలో స్టేషన్ పనులు, లైన్ ట్రాక్ పనులు నిర్మాణంలో ఉన్నాయి. రైల్వే స్టేషన్ భవన నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. మరుగుదొడ్లు, మంచినీరు సౌకర్యాలు పూర్తయ్యాయి. పొదిలి, కనిగిరి, కాళహస్తి వరకూ రైల్వే ట్రాక్ పనులు అక్కడక్కడ జరుగుతున్నాయి. నడికుడి-కాళహస్తి రైల్వే లైన్ ప్రతిపాదన అప్పట్లో కమ్యూనిస్టు ఉద్యమంతో ప్రారంభమైంది. గతంలో అనేక ప్రభుత్వాలు మారినా నడికుడి-కాళహస్తి రైల్వే లైన్ నిర్మాణం అమలుకు నోచలేదు. 2011 -2012లో నడికుడి- కాళహస్తి రైల్వే లైన్ నిర్మాణానికి రూ.2643 కోట్లతో నివేదిక తయారు చేశారు. 2016లో ప్రభుత్వం కొంత బడ్జెట్‌ను కేటాయించింది. అప్పటి నుంచి రైల్వే లైన్ పనులు ప్రారంభించారు. మధ్యలో పనులు మందకొడిగా సాగాయి. అనంతరం బిల్లులు చెల్లించలేదని ఆరునెలల పాటు కాంట్రాక్టర్లు పనులు నిలుపుదల చేశాడు. అనంతరం బిల్లులు చెల్లించారు. అనంతరం పనులు ప్రారంభించారు. గత మార్చి నాటికి మొదటి లైన్ నిర్మాణ పనులు దర్శి వరకూ పూర్తి చేశారు. నడికుడి నుంచి దర్శి వరకూ ట్రయల్ రన్ నిర్వహించారు. రైల్వే లైన్ నిర్మాణ పనులు పూర్తయితే ఇక్కడి ప్రజలు దర్శి నుంచి వినుకొండ మీదుగా నడికుడి వరకూ రాకపోకలు సాగించవచ్చు. అదేవిధంగా దర్శి నుంచి కాళహస్తి వరకూ రాకపోకలు సాగించవచ్చు. దర్శి నుంచి కాళహస్తి వరకూ రైల్వే నిర్మాణ పనులు పూర్తి కావాలంటే వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించాల్సి ఉంది.



దర్శి వరకూ పూర్తయిన రైల్వే ట్రాక్ పనులు

అక్షరానిదే ప్రధాన పాత్ర

నల్లూరి ఫౌండేషన్ అధినేత వెంకటశేషయ్య

ప్రజాశక్తి-చీమకుర్తి

మనిషి జీవితంలో అక్షరం, ఆరోగ్యం, ఆర్థికం ప్రధాన పాత్ర పోషిస్తాయని నల్లూరి ఫౌండేషన్ అధినేత, ప్రవాస భారతీయుడు నల్లూరి వెంకటశేషయ్య తెలిపారు. మండలం పరిధిలోని కూనంనేనివారిపాలెంలో నల్లూరి పౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన తెలుగు బాపిస్టు చర్చిని నల్లూరి వెంకటశేషయ్య, ప్రమీల దంపతులు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వెంకటశేషయ్య మాట్లాడుతూ మానవ ప్రయత్నం తరువాతే దైవ ప్రయత్నం చేయాలన్నారు ప్రతి విషయానికి దేవుడిపై భారం మోపడం సరికాదన్నారు. చదువుతోనే అన్నీ సాధ్యమన్నారు. ప్రజలంతా ద్వేషం వీడి ఐకమత్యంగా జీవించడం అవాటు చేసుకోవాలన్నారు. ఐకమత్యంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. పిల్లల చదువులపై తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. సొంత ఊరు రుణం తీర్చుకోవడానికి ఎల్లవేళలా తాను అందుబాటులో ఉంటాని తెలిపారు. సర్పంచి బక్కా శ్రీనివాసరావు, సంఘ కాపరి నెహేమియా మాట్లాడుతూ నల్లూరి పౌండేషన్ ఆధ్వర్యంలో కెవిపాలెంలో చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను కొనియాడారు. చదువు,కనీస సౌకర్యాల కల్పనకు పౌండేషన్ ద్వారా చేసిన సేవలను అభినందించారు. ఈ సందర్భంగా నల్లూరి వెంకటశేషయ్య, ప్రమీల దంపతులు, నల్లూరి సుబ్బారావును చర్చి పాస్టర్లు ఆశ్వీదించి సత్కరించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నల్లూరి పౌండేషన్ ప్రతినిధి పాలడుగు వెంకటనారాయణ, కెవిపాలెం సర్పంచి బక్కాశ్రీనివాసరావు, ఫాస్టర్లు డాక్టర్ సునీల్, డాక్టర్ పాల్ ఈశ్వరయ్య, డాక్టర్ రాజు, నెహేమియా, సంఘ పెద్దలు పాల్గొన్నారు.



చర్చీని ప్రారంభిస్తున్న నల్లూరివెంకటశేషయ్య, ప్రమీల దంపతులు



నల్లూరివెంకటశేషయ్య దంపతులను సత్కరిస్తున్న నిర్వాహకులు



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు

పోతుల రంగయ్యకు నివాళి

ప్రజాశక్తి-టంగుటూరు

కీర్తిశేషులు పోతుల రంగయ్య మూడవ వర్ధంతి స్థానిక ఎస్‌ఎల్‌టిసి ఆవరణలో జరిగింది.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు రంగయ్య చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం రామారావు మాట్లాడుతూ రంగయ్య రాజకీయ బీష్మడిగా కొనియాడారు. నివాళు లర్పించిన వారిలో సూదనగుంట శ్రీహరి, చిడిపోతు వెంకటేశ్వర్లు, పమిడి తులసిరావు, పోలినేని వెంకటేష్, పూనాటి వెంకటేశ్వర్లు, పులివర్తి రాఘవయ్య, పోతుల కృష్ణారావు, నరశింహారావు, రాజేంద్ర ప్రసాద్, టిడిపి నాయకులు కోటేశ్వరరావు, చదలవాడ వేణు, పమిడి కోటయ్య, కసుకుర్తి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ ప్రక్రియకు సహకరించాలి

వైసిపి దర్శి అభ్యర్థి బూచేపల్లి

ప్రజాశక్తి-దర్శి



బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి

ఈనెల 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు ప్రజలందరూ సహ కరించాలని వైసిపి దర్శి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి కోరారు. కౌంటింగ్ రోజున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా ప్రజలందరూ సహకరించాలన్నారు. పోలీసులకు ఎన్నికల కమిషన్ అధికారులకు సహకరించి శాంతియుతంగా కౌంటింగ్ జరిగే విధంగా ప్రజల సహకరించాలన్నారు. అదేవిధంగా వైసిపి నాయకులు కార్యకర్తలు కౌటింగ్ ప్రక్రియకు సహకరించాలన్నారు.

'చదవడం నాకిష్టం'

ప్రజాశక్తి-టంగుటూరు

వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో చదవడం నాకిష్టం అనే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేత పుస్తకాలు చదివించారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు గుమ్మడి వర్ధన రాజు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సెల్ ఫోన్ అప్పగింత

ప్రజాశక్తి -కనిగిరి

కనిగిరి డిపోకు చెందిన ఆల్ట్రా డీలక్స్ బస్సులో మేదరమెట్ల వచ్చేందుకు గుంటూరులో కె.విరాంజ్ గౌడ్ అనే వ్యక్తి ఎక్కాడు. బస్సు మేదరమెట్ల వచ్చిన తర్వాత ఆయన దిగిపోయాడు. కనిగిరి డిపోలో ప్రయాణిలందరూ దిగిపోయిన తర్వాత బస్సు గ్యారేజ్‌లోకి వెళ్తున్న సమయంలో సెక్యూరిటీ పాయింట్‌లో విధి నిర్వహణలో ఉన్న ఆర్‌సిఎస్ కెఎ.బేగం,హెడ్ కానిస్టేబుల్ ఎస్.కొండయ్య బస్సులో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీట్ల మధ్యలో పడిఉన్న సెల్ ఫోన్‌ను గమనించారు. అదే సమయంలో ఆసెల్‌ఫోన్ రింగ్ అయ్యింది. హెడ్ కానిస్టేబుల్ కొండయ్య ఫోన్ లిఫ్ట్ చేసి మాట్లాడారు. ఆ ఫోన్ తమదని, బస్సులో మర్చిపోయినట్లు బాధితుడుతు తెలిపాడు. అనంతరం సెక్యూరిటీ పాయింట్‌లో సెల్ ఫోన్‌ను భద్రపరిచారు. కనిగిరిలో ఉన్న విరాంజ్‌గౌడ్ సోదరుడు కెవిఎస్ గౌడ్ డిపో వద్దకు వచ్చి బస్సు, టిక్కెట్ వివరాలు తెలియపరిచాడు. దీంతో హెడ్ కానిస్టేబుల్ ఎస్. కొండయ్య సెల్‌ఫోన్‌ను అప్పగించాడు. విలువైన వస్తువులు తిరిగి అప్పగించినందుకు కెవిఎస్. గౌడ్ డిపో మేనేజర్,హెడ్ కానిస్టేబుల్ ధన్యవాదాలు తెలిపాడు.

ఒంగోలులో గెలుపుపై 'ఉత్కంఠ'

అంతుచిక్కని ఓటరు నాడి • గెలుపుపై వైసిపి, టిడిపిలో ఎవరి ధీమా వారిది • జోరందుకున్న బెట్టింగ్‌లు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఒంగోలు నియోజకవర్గంలో ఎవరు గెలుస్తారనే విషయంపై ఉత్కంఠ నెలకొంది. కౌంటింగ్‌కు సమయం దగ్గరపడే కొద్దీ వైసిపి, టిడిపి శ్రేణులతోపాటు సాధారణ ప్రజల్లో సైతం అభ్యర్థుల గెలుపుపై సర్వత్రా చర్చ జరుగుతోంది. అయితే ఓటర్లు ఎలాంటి తీర్పు ఇచ్చారన్నది ఎవరి అంచనాలకు అందడం లేదు. దీంతో ప్రధాన పార్టీలు అయిన వైసిపి, టిడిపి నేతలు ఒంగోలు నియోజకవర్గంలో బూత్‌లవారీగా పోల్ అయిన ఓట్లు, అందులో ఏ పార్టీ అభ్యర్థికి ఎన్ని ఓట్లు వచ్చిఉంటాయనే దానిమీద లెక్కలు కడుతున్నారు. గెలుపుపై ఇరుపార్టీల అభ్యర్థులు ధీమాగా ఉన్నారు. పోలింగ్ హెూరాహెూరీగా జరిగిందని విశ్లేషకులు చెబుతున్నారు. ఇందులో అభ్యర్థులకు కలిసివచ్చే అంశాల గురించి చర్చిస్తున్నారు. అధికార పార్టీ వైసిపి అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డికి వైసిపి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు కలిసి వస్తాయని లెక్కలు కడుతున్నారు. మరోవైపు ఓటర్లకు నగదు పంపిణీ, ఇతరత్రా తాయిలాలు ఇవ్వడంలోనూ బాలినేని శ్రీనివాసరెడ్డి ముందంజలో ఉండటంతో ఆపార్టీ శ్రేణులు గెలుపుపై ధీమాగా ఉన్నారు. ఎన్నికలకు ముందు ఒంగోలు నగరంలో సుమారు 20వేల మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడం కూడా బాలినేనికి లాభించిందని చెబుతున్నారు. అయితే పట్టాలు పొందిన వారిలో ఎంతమంది బాలినేనికి ఓటేసి ఉంటారనే చర్చ కూడా జోరుగా సాగుతోంది. సచివాలయాలు, వాలంటీర్ల వ్యవస్థ వల్ల ప్రజల్లో సానుకూలత ఉన్నట్లు ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. మరోవైపు టిడిపి కూటమి అభ్యర్థి దామచర్ల జనార్ధన్ కూడా గెలుపుపై ధీమాగా ఉన్నట్లు ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. గతంలో ఆయన ఎమ్మెల్యేగా



బాలినేని శ్రీనివాసరెడ్డి



దామచర్ల జనార్దన్

ఉన్నప్పుడు ఒంగోలు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, తెలుగుదేశం పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన సూపర్ సిక్స్ పథకాలు, వైసిపి ప్రభుత్వం మీద ఉన్న వ్యతిరేకత తమకు కలిసి వస్తుందని చెబుతున్నారు. జనసేన, బిజెపి పొత్తు వల్ల కలిసివచ్చిన ఓట్లమీద ధీమాగా ఉన్నారు. ఇక సామాజిక వర్గాల వారీగా ఇరుపార్టీల అభ్యర్థులకు వచ్చిన మద్దతు మీద లెక్కలు కడుతున్నారు. బూత్‌లవారీగా పోల్ అయిన ఓట్లు, అందులో ఎవరికి ఎన్ని ఓట్లు వచ్చిఉంటాయనే దానిమీద ఆరా తీస్తున్నారు. ఇంకోవైపు బాలినేని, దామచర్ల గెలుపుమీద భారీగా బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. ఎవరు ఎంత మెజారిటీతో గెలుస్తారనే దానిమీద బెట్టింగ్‌లు జరుగుతున్నట్లు సమాచారం. ఓట్ల పోలింగ్‌లో ఇద్దరు అభ్యర్థులకు సమాన ఆదరణే లభించిందని, ఎవరు గెలిచినా మెజారిటీ ఐదు వేల నుంచి పదివేలలోపు ఉంటుందనే చర్చ జోరుగా సాగుతోంది. ఎక్కువ శాతం బెట్టింగ్‌లు కూడా ఈ మెజారిటీ మీదనే కడుతున్నట్లు చర్చ జరుగుతోంది. ఎవరు గెలుస్తారు...? గెలిస్తే ఎంత మెజారిటీతో గెలుస్తారు...? అనే అంశాల మీద కోట్ల రూపాయల బెట్టింగ్‌లు జరిగాయని సమాచారం.

ఉద్యోగులు, మధ్యతరగతి ప్రజలు ఎవరికి ఓటేశారనే దానిమీద ఓ అంచనాకు వస్తున్నప్పటికీ, స్లమ్ ఏరియా ప్రజలు ఎవరిని ఆదరించారనే విషయం మీద మాత్రం ఎవరు కూడా అంచనాకు రాలేకపోతున్నారని సీనియర్ రాజకీయ నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు. పెరిగిన ఓటింగ్ ఎవరికి కలిసివస్తుందనే దానిమీద కూడా ఓ అంచనాకు రాలేకపోతున్నామని చెబుతున్నారు. ఇండియా వేదిక నుంచి పోటీలో నిలిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి కూడా కొంత ఓటింగ్ శాతం నమోదైంది. ఇది ఏ పార్టీ ఓటు బ్యాంకుకు నష్టం కలిగించిందనే చర్చ కూడా విశ్లేషకుల్లో వినిపిస్తోంది. ఏది ఏమైనా ఆరోసారి ఎమ్మెల్యేగా గెలిచి సిక్స్ కొట్టాలని బాలినేని శ్రీనివాసరెడ్డి ఆతృతతో ఎదురు చూస్తుంటే రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచి తనదైన మార్కును చాటుకోవాలనే తలంపుతో దామచర్ల జనార్దన్ ఉన్నారు. పల్లెల్లో ఓటింగ్ ఎవరివైపు జరిగిందనే అంచనాకు రావడం కొంత సులభమైతే పట్టణాల్లో ఓటరు ఎటు వైపు ఉన్నాడని అంచనా వేయడం అంత తేలిక కాదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఒంగోలు నగరంతోపాటు ఒంగోలు రూరల్ మండలం, కొత్తపట్నం మండలాల ఓటర్లు కూడా ఒంగోలు నియోజకవర్గ అభ్యర్థుల గెలుపులో కీలక భూమిక పోషించనున్నారు. ఈ క్రమంలో ఈ నెల 4న జరిగే ఎన్నికల ఫలితాలలో ఒంగోలు నియోజకవర్గంలో ఎవరు విజేతగా నిలుస్తారనే 'ఉత్కంఠ' కొనసాగుతోంది. రాజకీయంగా ఇవే తన చివరి ఎన్నికలని వైసిపి అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి ఎన్నికలకు ముందు ప్రకటించారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి దామచర్ల జనార్దన్ రాజకీయ భవిష్యత్తుకు కూడా ఈ ఎన్నికలే కీలకం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఒంగోలు నియోజకవర్గ ఫలితంపై అన్ని వర్గాల ప్రజలు ఆతృతతో ఎదురు చూస్తున్నారు.



కౌంటింగ్ ఏజెంట్లకు సూచనలు ఇస్తున్న మేరుగు నాగార్జున

కౌటింగ్ ఏజెంట్లకు 'మేరుగు' సూచనలు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మేరుగు నాగార్జున కౌంటింగ్ ఏజెంట్లకు పలు సూచనలు చేశారు. ఈ నెల 4వ తేదీ మంగళవారం ఉదయం రైజ్ పాలిటెక్నిక్ కాలేజీలో జరగనున్న సంతనూతలపాడు నియోజకవర్గ ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి సంబంధించి, ఆదివారం ఒంగోలులోని కర్నూల్ రోడ్‌లో గల లాస్య గ్రాండ్ హెూటల్ సమావేశ మందిరంలో నిర్వహించిన కౌంటింగ్ ఏజెంట్ల శిక్షణ తరగతులకు ఆయన హాజరయ్యారు. కౌంటింగ్ ఏజెంట్లకు తగు సలహాలు, సూచనలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు నియోజకవర్గంలోని వైసిపి ముఖ్య నాయకులు, కౌంటింగ్ ఏజెంట్లు పాల్గొన్నారు.



పోలీసు సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ అశోక్‌బాబు

ప్రజలు పోలీసులకు సహకరించాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ఈ నెల 4వ తేదీన వెలువడనున్న నేపథ్యంలో యర్రగొండపాలెంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని జిల్లా అదనపు ఎస్పీ అశోక్‌బాబు అన్నారు. ఆదివారం సాయంత్రం యర్రగొండపాలెం పట్టణంలో పోలీసులతో నిర్వహిస్తున్న పహారాను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు ఎవరికి అనుకూలంగా వచ్చినా సంయమనం పాటించాలని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐ రాములు నాయక్, పోలీసులు పాల్గొన్నారు.



జూమ్ మీటింగ్‌లో పాల్గొన్న తాటిపర్తి చంద్రశేఖర్

మరోమారు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నాం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రాష్ట్రంలో మరోమారు వైసీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయం నుంచి రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల నాయకులతో జూమ్ మీటింగ్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా యర్రగొండ పాలెం లోని వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జూమ్ మీటింగ్‌లో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ నాయకులతో కలసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సందేశాన్ని విన్నారు. అనంతరం తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీకి ఎగ్జిట్ పోల్ కంటే ఎక్కువ సీట్లు వస్తాయని తెలిపారు. తిరిగి జగన్మోహన్‌రెడ్డి ముఖ్య మంత్రి కావాలని ప్రతి ఒక్కరూ కోరుకున్నారని తెలిపారు. అందుకే రాష్ట్ర వ్యాప్తంగా పోలింగ్ శాతం పెరగడంతో పాటు సైలెంట్ ఓటింగ్ జరిగిందన్నారు. యర్రగొండపాలెంలో కూడా భారీ మెజార్టీతో గెలవబోతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి చేదూరి విజయభాస్కర్, వైసీపీ నాయకులు వెంకటరెడ్డి, దోమకాల వెంకటేశ్వర్లు, సింగా ప్రసాద్, గంజి శ్రీనివాసరెడ్డి, వాగ్యా నాయక్, బాబులు నాయక్, ముసలారెడ్డి, ప్రసాద్, జబివుల్లా, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవి మోడీ మీడియా పోల్స్

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సైదా

ప్రజాశక్తి-పొదిలి



సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నిన్న వివిధ మీడియా ఛానల్స్‌లో వివిధ ఎన్నికల సర్వే సంస్థలు కేంద్రంలో మోడీ నాయకత్వంలోని ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తుందని ప్రకటించిన ఎగ్జిట్ పోల్స్‌కి ప్రజల విశ్వాసనీయత లేదని, అవి కేవలం" మోడీ మీడియా పోల్స్" మాత్రమేనని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సైదా అన్నారు. ఆదివారం పొదిలిలో విలేకరులతో మాట్లాడుతూ గత పది సంవత్సరాల మోడీ పాలలో దేశం తిరోగమన దిశలో పయనించిందని, అలాంటి నేత నాయకత్వంలోని ఎన్డీఏ కూటమికి ఏ విధంగా ప్రజలు పట్టం కడతారని సైదా ప్రశ్నించారు. మొత్తం 543 లోక్‌సభ స్థానాల్లో 400పై చిలుకు బిజెపికే వస్తాయని జబ్బలు చరిచి మాట్లాడిన బిజెపి నాయకులకు నాలుగో తేదీన వచ్చే ప్రజా పోల్స్‌తో దిమ్మ తిరిగిపోవడం తథ్యమని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలోని ఇండియా కూటమి దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో ప్రజల అభిమానాన్ని చూరగొందని అన్నారు. ఈ నెల 4 తారీకు జరగనున్న ఓట్ల లెక్కింపులో ఎవరూ ఊహించని రీతిలో ఇండియా కూటమి విజయం సాధించబోతోందని షేక్ సైదా ధీమా వ్యక్తం చేశారు. దక్షిణ భారతదేశంలోని తమిళనాడు, కేరళలో స్థానిక ప్రాంతీయ పార్టీలతో కలిసి ఒకటి రెండు స్థానాల్లో ఖాతా తెరవచ్చునేమో కానీ ఉత్తర భారత దేశంలోని అనేక రాష్ట్రాల్లో బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ కూటమికి నిరాశ తప్పదని సైదా అన్నారు. ఆంధ్ర ప్రదేశ్‌లో కూడా కాంగ్రెస్ పార్టీ గణనీయమైన సంఖ్యలో ఓట్లు సాధించబోతోందని అన్నారు. పార్లమెంటులో, శాసనసభలో కాంగ్రెస్ పార్టీ నుంచి 10 సంవత్సరాల తర్వాత మొదటిసారిగా అడుగుపెట్టనున్నామని సైదా ఆశాభావం వ్యక్తం చేశారు.



కందుల నారాయణరెడ్డి ఇంటిలో సమావేశమైన టిడిపి అభ్యర్థులు

'కందుల' ఇంట టిడిపి అభ్యర్థుల సమావేశం

ప్రజాశక్తి-మార్కాపురం

రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి రాబోతోందని, ఈ నెల 4న వచ్చే ఫలితాలు టిడిపికి అనుకూలంగా ఉంటాయని ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని టిడిపి అభ్యర్థులు ధీమా వ్యక్తం చేశారు. ఉమ్మడి ప్రకాశంలోని టిడిపి అభ్యర్థులంతా మార్కాపురంలోని టిడిపి అభ్యర్థి కందుల నారాయణరెడ్డి ఇంట ఆదివారం సమావేశమయ్యారు. జిల్లాలోనూ టిడిపి హవా ఉందన్నారు. పది స్థానాల్లో విజయావకాశాలు ఉన్నాయని భావించారు. రాష్ట్రంలో చంద్రబాబు మరోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని ధీమా వ్యక్తం చేశారు. ఎవరికి ఎలా ఓట్లు లభించాయనే దానిపై చర్చించుకున్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి ప్రణాళికతో ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. అనంతరం తర్లుపాడు మండలంలోని తుమ్మల చెరువులో ప్రఖ్యాత హజరత్ ఖాసీంబాబా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చెయ్యాలని, ప్రకాశం ఉమ్మడి జిల్లాలో తెలుగు దేశం అభ్యర్థులు ప్రతి ఒక్కరూ గెలవాలని ప్రార్థించారు. టిడిపి అభ్యర్థి కందుల నారాయణరెడ్డితో పాటు ఒంగోలు టిడిపి అభ్యర్థి దామచర్ల జనార్దన్, అద్దంకి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్, కనిగిరి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, గిద్దలూరు అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి, యర్రగొండపాలెం అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు, దర్శి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి భర్త లలిత్ సాగర్, ఒంగోలు టిడిపి నాయకులు పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి తదితరులు సమావేశమైన వారిలో ఉన్నారు.

వంట నిర్వాహకులకు శిక్షణ

ప్రజాశక్తి-కొమరోలు

కొమరోలు మండలంలోని మధ్యాహ్న భోజన పథకం వంట నిర్వాహకులకు, సహాయకులకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి స్థానిక మండల విద్యాశాఖ అధికారులు బి వెంకటరత్నం, కే వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించగా వందేమాతరం గీతాలాపనతో ప్రారంభించారు. కొమరోలు మండలంలోని ప్రభుత్వ యాజమాన్యంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి వంట నిర్వాహకులు, సహాయకులు దాదాపుగా 61 మంది హాజరయ్యారు. ఈ సమావేశంలో పోషకాహార విలువలను పెంచుటకు వంట నిర్వాహకులు నిర్వహించవలసిన పద్ధతులను వివరించారు. ఉదయం పూట శిక్షణ కార్యక్రమం నిర్వహించగా మధ్యాహ్న భోజన తయారీ సమయంలో చేపట్టవలసిన పారిశుధ్య నియమాలు స్పష్టంగా వివరించారు. మధ్యాహ్నం రెండు గంటలకు మండలంలోని ఎనిమిది మంది వంట నిర్వాహకులు తయారుచేసిన మధ్యాహ్న భోజన పదార్థాలను ప్రదర్శించారు. వీటిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ఎంపిక చేశారు. ప్రథమ బహుమతికి రెడ్డిచెర్ల మండల ప్రాథమికోన్నత పాఠశాల, ద్వితీయ బహుమతి కొమరోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తృతీయ బహుమతి తాతిరెడ్డిపల్లె మండల ప్రాథమిక పాఠశాల ఎంపికయ్యాయి. ఈ పాఠశాలల వంట నిర్వాహకులు, సహాయకులకు ఎంఈఓలు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు బుర్ర వెంకటరత్నం, కావడి వెంకటేశ్వర్లు, ఆర్పి సిహెచ్ శ్రీనివాసులు, సిఆర్పీలు ఎంఐఎస్ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

ఎన్నికలు ముగిసి రెండు వారాలకుపైగా గడిచింది. ఇక ఓట్ల లెక్కింపుకి ఒక్క రోజు మాత్రమే సమయముంది. ఈ నేపథ్యంలో అభ్యర్థులు, నాయకులు, ప్రజలందరిలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ ఎన్నికల్లో పెరిగిన ఓట్ల శాతం ఎవరికి అనుకూలంగా ఉంటుందనే విషయంలో నాయకుల్లో అలజడి నెలకొంది. పర్చూరు నియోజక వర్గంలో ప్రధానంగా టిడిపి, వైసిపి మధ్యే పోటీ సాగింది. టిడిపి అభ్యర్థిగా ఏలూరి సాంబశివరావు, వైసిపి అభ్యర్థిగా యడం బాలాజీ పోటీ పడ్డారు. రెండు సార్లు ఎంఎల్ఏగా గెలిచి మూడో సారి హ్యాట్రిక్ కొట్టి అత్యధిక మెజారిటీ సాధించడమే లక్ష్యంగా ఏలూరి వ్యూహరచన చేశారని టిడిపి నేతలు చెబుతున్నారు. ఏలూరిని ఎదుర్కొనే ధీటైన అభ్యర్థి కోసం చివరి క్షణం వరకు ఎదురు చూసిన వైసిపి అధిష్టానం చీరాలకు చెందిన యడం బాలాజీని హుటా హుటిన విదేశాల నుండి రప్పించి వైసిపి ఎంఎల్ఏ అభ్యర్థిగా రంగంలోకి దించింది. వైసిపి అందించిన సంక్షేమ పథకాలే తనను గెలిపిస్తాయనే నమ్మకంతో వైసిపి అభ్యర్థి ఉన్నారు. ఈ



పోలింగ్ రోజు బారులు తీరిన మహిళా ఓటర్లు (ఫైల్‌ఫోటో)

క్రమంలో ఇరు పార్టీలు పోటా పోటీగా ప్రచారం చేశారు. ఇప్పటికీ నియోజకవర్గంలో ఎన్నికల వేడి కొనసాగుతుంది. మండలాలు, పంచాయతీల వారీగా ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వస్తాయన్న లెక్కలు వేసుకుంటున్నారు. చినగంజాం, కారంచేడు, పర్చూరు, ఇంకొల్లు, యద్దనపూడి, మార్టూరులో 2,29,333 మంది ఓటర్లు ఉండగా 2,00,264 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో అత్యధికంగా 1,02,238 మహిళలు ఓట్లు వేశారు. ఈ మహిళలు ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వస్తాయనే అంచనాల్లో ఉన్నారు. ప్రజలు కూడా ఓట్ల లెక్కింపుపై ఆసక్తి కనబరుస్తున్నారు.

ఎవరి లెక్కలు వారివే

ప్రభుత్వ వ్యతిరేక ఓటుతో పాటు ఎంఎల్ఏ ఏలూరి సాంబశివరావుపై పార్టీలకు అతీతంగా అభిమానంతో వేసిన ఓట్లు తమకు అనుకూలంగా పడ్డాయని టిడిపి, సంక్షేమ పథకాల అమలు తమకు అనుకూలమని వైసిపి భావిస్తోంది. దీంతో అభ్యర్థుల్లో గెలుపుపై ఉత్కంఠ నెలకొంది. టిడిపి, వైసిపి కార్యకర్తలు మాత్రం తమ పార్టీ అంటే తమ పార్టీనే గెలుస్తుందనే ఉత్సాహంలో ఉన్నారు. విజయోత్సావాలకు కూడా సిద్ధపడుతున్నారు. ఈ లెక్కలకు తెర పడాలంటే 4వరకు వేచిచూడాల్సిందే. పురుషుల కంటే మహిళలు ఎక్కువగా ఓటింగులో పాల్గొనడం ఈ సారి ఎన్నికల్లో విశేషం. ఈ ప్రభావం అధికార పార్టీకి అనుకూలమని ఓ వర్గం, కూటమి ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలకు ఆకర్షితులై ఓట్లు వేశారని టిడిపి భావిస్తోంది.

నిఘా ఉన్నా.. ఆగని ఇసుక అక్రమ రవాణా



ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లు

ప్రజాశక్తి - వేమూరు

ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు రెవెన్యూ, పంచాయతీ అధికారులు ఇసుక రీచుల వద్ద 24గంటలు ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసినప్పటికీ ఇసుక అక్రమ తరలింపు మాత్రం ఆగటం లేదు. గత నెల 18న కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ వకుల్ జిందాల్ భట్టిప్రోలు, కొల్లూరు మండలాల పరిధిలోని కృష్ణా నది ఇసుక రీచ్‌లను పరిశీలించారు. ఈ పరిశీలనలో వెలుగు చూసిన అంశాల దృష్ట్యా ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు రెవెన్యూ, పంచాయతీ రీచ్ల వద్ద నిఘా ఏర్పాటు చెయ్యాలని మండల అధికారులను ఆదేశించారు. అప్పటి నుండి మండల అధికారులు ఇసుక రిచ్చకు వెళ్లేందుకు రహదారికి అడ్డుగా గుంటలు కొట్టి మూడు షిఫ్టులుగా సిబ్బందిని కాపలా ఉంచారు. ఈ విధానం భట్టిప్రోలు మండలంలోని ఒలేరు, పెదలంక, కాకులడొంక వద్ద నిరంతర నిఘా కొనసాగుతుంది. కొల్లూరు మండలంలో కొనసాగటం లేదనేది స్పష్టమౌతుంది. ప్రతి రోజు కొల్లూరు మండలం జువ్వాలపాలెం, ఏటిఒడ్డుగూడెం గ్రామాల వద్ద గల అక్రమ రీచ్ల నుండి రాత్రి సమయంలో ఇసుక అక్రమ రవాణా ట్రాక్టర్ల ద్వారా కొనసాగుతూనే ఉంది. ఈ ట్రాక్టర్లు కొల్లూరు మండలం నుండి భట్టిప్రోలు మండలం వెల్లటూరు, భట్టిప్రోలు, ఐలవరం, వేమూరు మండలం చావలి, పెరవలి గ్రామాలకు తరలిస్తున్నారు. వీటిని నియంత్రించే పోలీస్ సిబ్బంది కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో చదేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా కొనసాగుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

పోలీసుల కనుసన్నల్లోనే ఇసుక రవాణా

ఇసుక అక్రమ రవాణా చేపట్టితే చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికాల నుండి ఆదేశాలు అందడంతో రెవెన్యూ, పంచాయతీ అధికారులు మాత్రం రిచ్ల వద్ద నిఘాని ఏర్పాటు చేసినప్పటికీ ఫలితం ఉండటం లేదు. రాత్రి వేళల్లో రవాణా జరిగే ట్రాక్టర్లను పోలీసులు నిఘా ఉంచి పట్టుకోవాల్సి ఉండగా అందుకు భిన్నంగా దొరికిన డ్కర్లను నుండి మాములు పుచ్చుకొని డ్కర్లను అదుపులోకి తీసుకోకుండా వదిలిపెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. శనివారం రాత్రి సుమారు 8 గంటల సమయంలో వెల్లటూరు, భట్టిప్రోలు గ్రామాల మధ్య సుమారు అక్రమ రవాణా చేస్తున్న ఆరు ట్రాక్టర్లను పోలీసులు ఆపి పట్టుకున్నారు. వీటిని పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్టు చేస్తారని చూసిన ప్రజలంతా భావించారు. కానీ కొద్దిసేపటి తర్వాత ఒక ట్రాక్టర్ కూడా పోలీస్ స్టేషన్ వద్దకు రాకపోగా యధావిధిగానే అనుకున్న ప్రాంతాలకు వెళ్లి ఇసుక సరఫరా చేశారు. దొరికిన ట్రాక్టర్ల వద్ద పోలీసులు మాములు పుచ్చుకొని వదిలేసినట్లుగా ప్రజలు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ, పంచాయతీ అధికారులు మాత్రమే ఇసుక అక్రమ రవాణాను అరికట్టలేరని, పోలీసులు కూడా బాధ్యతగా పనిచేస్తే ఉన్నతాధికారుల ఆలోచన విధానం పూర్తిస్థాయిలో అమలు జరుగుతుందని, కాసులకు కక్కుర్తి పడి వదిలేస్తే నిఘా ఉంచినా ఫలితం ఏమి ఉంటుందని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు.

ఈ విషయంపై తహశీల్దారుపై ముని లక్ష్మి మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు భట్టిప్రోలు మండల పరిధిలోని ఇసుక రీచులకు గండ్లు కొట్టు మరి సిబ్బందిని నిఘా ఉంచామని అన్నారు. కానీ కొల్లూరు మండల వైపు నుండి ఇసుక ట్రాక్టర్లు రాత్రి వేళల్లో భట్టిప్రోలు వైపు తిరుగుతున్నట్లుగా తన దృష్టికి వచ్చిందని, రాత్రి సమయంలో పోలీసులు కూడా సహకరిస్తేనే వీటిని అరికట్టగలమని పేర్కొన్నారు.



ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లు

ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - చీరాల

ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఎలాంటి ఘర్షణలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ సిఐ నిమ్మగడ్డ సత్యనారాయణ హెచ్చరించారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల ప్రకారం, డిఎస్‌పి బేతపూడి ప్రసాద్ ఉత్తర్వుల మేరకు ఓట్ల లెక్కింపు సమయంలోగాని, తర్వాత ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ఈపురిపాలెం ఎస్ఐ శివకుమార్ ఆధ్వర్యంలో స్పెషల్ పోలీస్ సిబ్బందితో కలసి వాడరేవు, గవినివారిపాలెం, రామాపురంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆదివారం నిర్వహించారు. వాహన తనిఖీలు చేసి ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ప్రతి ఇంటినీ సోదా చేశారు. ఘర్షణలకు పాల్పడే వస్తువులు ఉంచుకోవద్దని హెచ్చరించారు. రౌడీ షీటర్లకు వారి ఇంటి వద్దనే కౌన్సిలింగ్ ఇచ్చారు. పోలీసు ఉత్తర్వులను అతిక్రమిస్తే కేసులు నమోదు చేయడమే కాకుండా రౌడీ షీట్స్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు.

సంతమాగులూరు: ఈనెల 4న జరుగుతున్న ఓట్ల లెక్కింపు సందర్భంగా గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉందని



వాడరేవులో కవాతు చేస్తున్న పోలీసులు

సిఐ నరసింహారావు, ఎస్ఐ పి సురేష్ సూచించారు. ప్రజలు గుంపులుగా ఉండ కూడదని చెప్పారు. అభ్యర్థుల గెలుపు సందర్భంగా ఎలాంటి బాణాసంచా కాల్చకూడదని అవగాహన కల్పించారు. మండలంలోని సంతమాగులూరు, వెల్లలచెరువు, కామేపల్లి, ఏల్చూరు, కుందుర్రు గ్రామాల్లో స్పెషల్ పార్టీ పోలీసులతో ఆదివారం కవాతు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పోలీసు హెచ్చరికలు, నిబంధనలు పాటించకుండా అల్లర్లు సృష్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రేపల్లె : ఈనెల 3 నుండి 5వరకు పట్టణంలో దుకాణాలు మూసివేయాలని సీఐ నజీర్ బేగ్ వ్యాపారస్తులను హెచ్చరించారు. తన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓట్ల లెక్కింపు ఈనెల 4న జరుగుతున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా అల్లరి మూకలు, రౌడీలు, బెట్టింగ్ రాయుళ్ళు, తాగుబోతులు రెచ్చిపోయి ఒకరి నొకరు దూషించుకుంటూ అల్లర్లు, హత్యలు, జరిగే ప్రమాదం పొంచి ఉంటుందనిదే ముందుస్తు ఆలోచనతో షాపుల బందుకు ఉత్తర్వులు ఇచ్చినట్లు సిఐ నజీర్ బేగ్ చెప్పారు. పట్టణంలో మెడికల్ షాపులు, పాల బూతులు, పాల కేంద్రాలు పనిచేస్తాయని పట్టణంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని అన్నారు. ఎక్కడ ఇద్దరు, ముగ్గురు కనిపించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజలు పోలీసు సిబ్బందికి సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

యువకుడిని కాపాడిన పోలీసులు

ప్రజాశక్తి - బాపట్ల



చికిత్స అందిస్తున్న వైద్యులు

సూర్యలంక బీచ్‌లో స్నానం చేస్తూ అలల తాకిడికి కొట్టుకుపోతున్న హైదరాబాదు యువకుడిని ఒడ్డుకు చేర్చి మెరైన్ పోలీసులు ప్రాణాలు కాపాడారు. హైదరాబాదు నుండి స్నేహితులతో వచ్చి సూర్యలంక బీచ్‌లో స్నానాలు చేస్తూ అలల తాకిడికి కొట్టుకుపోతున్న 18ఏళ్ల యువకుడు గౌస్‌ను మెరైన్, అవుట్ పోస్ట్ పోలీసు సిబ్బంది, గజ ఈతగాళ్ళ సాయంతో ఒడ్డుకు చేర్చి బాపట్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. సముద్రం ఉప్పునీరు తాగడంతో ఊపిరితిత్తుల్లో నీరు చేరడంతో అందుకు అవసరమైన వైద్య సౌకర్యం అందించేందుకు ఆధునిక సౌకర్యాలు లేకపోవడంతో గుంటూరు జిజిహెచ్‌కి తరలించారు. ప్రాణాపాయం తప్పిందని పోలీసులు తెలిపారు.



గ్రామస్తులకు సూచనలిస్తున్న సిఐ నరసింహారావు

నరసరావుపేట మార్గం మూసివేత

ప్రజాశక్తి - సంతమాగులూరు

మే నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ఈ నెల 4న జరగ నున్న నేపథ్యంలో పుట్టావారిపాలెం అడ్డరోడ్ జంక్షన్ నుండి నరసరావుపేట వెళ్లే మార్గాన్ని పూర్తిగా మూసివేస్తున్నట్లు సిఐ నరసింహారావు ఆదివారం తెలిపారు. పల్నాడు జిల్లాలోని ఓట్లు లెక్కింపు కేంద్రం సంతమాగులూరు సరిహద్దులోని జెఎన్‌టియు కళాశాలనందు లెక్కింపు జరుగుతుందని, శాంతి భద్రతల దృష్ట్యా బాపట్ల, పల్నాడు జిల్లాల ఎస్పీలు వకుల్ జిందాల్, మల్లికా గర్గ్ ఆదేశాల మేరకు గుంటూరు, కర్నూలు రహదారిలో నరసరావుపేట వైపు ప్రయాణించే వాహనాలు, అడ్డ రోడ్డు జంక్షన్ నుండి పిడుగురాళ్ల వైపు, అద్దంకి వైపు మార్గాల ద్వారా వెళ్లేందుకు అవకాశం ఉన్నందున వాహనదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. నరసరావుపేట వెళ్లే దారిలో ఓట్ల లెక్కింపుకు వెళ్లే ఏజెంట్లను మాత్రమే అనుమతిస్తామని అన్నారు. ఈ పరిస్థితుల దృష్ట్యా ప్రయాణికులు, వాహనదారులు గమనించాలని కోరారు.



అగ్నిప్రమాదంలో గద్దమవుతున్న చెత్త

డంపింగ్ యార్డులో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - బాపట్ల

పురపాలక సంఘం డంపింగ్ యార్డులో ఆదివారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. ఒక్క సారిగా డంపింగ్ యార్డు అంతటా మంటలు వ్యాపించాయి. డంపింగ్ యార్డులో చెత్త మాత్రమే తగలబడటంతో ఏ విధమైన ఆస్తి నష్టం జరగలేదు. పట్టణ శివారులో జమ్ములపాలెం రోడ్డులోని డంపింగ్ యార్డులో జరిగిన ప్రమాదంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులకు ఏ విధమైన నష్టం వాటిల్ల లేదు. కాని ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది.

బస్సును ఢీకొన్న వ్యక్తికి ప్రథమ చికిత్స

ప్రజాశక్తి - బాపట్ల

బాపట్ల పాత బస్టాండులో ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును స్కూటీతో ఢీ కొట్టి కిందపడి గాయపడిన వ్యక్తికి ప్రథమ చికిత్స అనంతరం ఆసుపత్రి నుండి పంపినట్లు ఆసుపత్రి అవుట్ పోస్ట్ పోలీసులు ఆదివారం తెలిపారు.

ఓటమి భయంతోనే దామచర్ల వ్యాఖ్యలు

ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఓటమి భయంతోనే దామచర్ల జనార్దన్ పొంతన లేని వ్యాఖ్యలు చేస్తున్నారని ఒంగోలు ఎమ్మెల్యే, వైసిపి ఒంగోలు నియోజకవర్గ అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి విమర్శించారు. ఆదివారం ఆయన తనను కలిసిన పాత్రికేయులతో మాట్లాడారు. తన మీద, తన కొడుకు, కోడలు మీద రౌడీషీట్ ఓపెన్ చేయాలని దామచర్ల జనార్దన్ వ్యాఖ్యానించడానికి ఖండించారు. మహిళ మీద రౌడీషీట్ ఓపెన్ చేయమని డిమాండ్ చేయడం ఏంటని ప్రశ్నించారు. దామచర్ల జనార్దన్‌కి అసలు సంస్కారం ఉందా.? అని ప్రశ్నించారు. ముందు జనార్దన్ పలువురి వద్ద చేసిన అప్పులు తీర్చాలని సూచించారు. ఆయనకు అప్పు ఇచ్చిన వారు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు ఉన్నాయని వివరించారు. అప్పుడు ఆయన మీద కేసు పెట్టాల్సి ఉంటుందని వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో ఓటమి భయంతో మతిభ్రమించి ఆయన అర్థంపర్థం లేని వ్యాఖ్యలు చేస్తున్నారని, నెల రోజుల కిందట జరిగిన ఓ చిన్న ఘటన గురించి ఇప్పుడు రాద్ధాంతం చేస్తున్నాడని విమర్శించారు. తన కోడలు ఎవరి మీద అయినా చేయిచేసుకున్నట్లు నీవు చూశావా..? అని జనార్దన్‌ను సూటిగా ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు రిమ్స్‌లో జరిగిన పరిణామాలకు కూడా దామచర్ల జనార్దనే బాధ్యుడని బాలినేని విమర్శించారు. రిమ్స్ వైద్యశాలలో వైసిపి కార్యకర్తలను జనార్దన్ బెదిరించాడని, బాధితులు అక్కడి నుంచి ఫోన్ చేస్తేనే తాను రిమ్స్ వైద్యశాలకు వెళ్లానని చెప్పారు. ఆ విషయం తెలుసుకుని వైసిపి కార్యకర్తలు అక్కడికి వచ్చారని గుర్తు చేశారు. 'నీ వెంట ఎవరూ రారు..! మా వెంట వస్తే ఓర్చుకోలేకపోతున్నావు' అని వ్యాఖ్యానించారు.

దుగ్గిరాల గోపాలకృష్ణయ్య జయంతి వేడుకలు

ప్రజాశక్తి-చీరాల

ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య జయంతి వేడుకలు చీరాలలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గోపాలకృష్ణయ్య విగ్రహానికి వివేకానంద సేవా సమితి, ఘంటసాల చైతన్య వేదిక ప్రతినిధులు పూల మాలలు వేసి.. నివాళి అర్పించారు. బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చీరాల-పేరాల ఉద్యమాన్ని నడిపిన గొప్ప స్వతంత్ర సమరయోధుడు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య అని కొనియాడారు. పన్నులను వ్యతిరేకించి ప్రజలందరితో కలిసి పుర బహిష్కరణ చేసి బ్రిటిష్ ప్రభుత్వాన్ని గడగడలాడించిన ధైర్యశాలి అన్నారు. గాంధీ మహాత్ముడు సైతం చీరాల వచ్చి దుగ్గిరాల పోరాటాన్ని అభినందించారని చెప్పారు. ఇటువంటి వ్యక్తులను నేటి యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో సర్వశెట్టి సుబ్బారామయ్య, శివప్రసాదరావు, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్‌రెడ్డి, హరిప్రసాద్, సుధీర్ పాల్గొన్నారు.



దుగ్గిరాల గోపాలకృష్ణయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

కౌంటింగ్ పారదర్శకంగా నిర్వహించాలి

- పోస్టల్ బ్యాలెట్ల కౌంటింగ్ సజావుగా జరపాలి
- కలెక్టర్‌కు కూటమి నేతల వినతి



కలెక్టర్‌కు అర్జీ ఇస్తున్న దామచర్ల జనార్దన్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో ఈనెల 4న జరిగే సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏఎస్.దినేష్ కుమార్‌ను టిడిపి-బిజెపి-జనసేన కూటమి అభ్యర్థులు కోరారు. స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారిని ఆదివారం కలిసి కూటమి నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఒంగోలు అసెంబ్లీ అభ్యర్థి దామచర్ల జనార్దనరావు మాట్లాడుతూ కౌంటింగ్ సందర్భంగా వైసిపి నేతలు గొడవలకు దిగే అవకాశం ఉందని, వాటిని అదుపు చేయాలని కోరారు. పోస్టల్ బ్యాలెట్ల కౌంటింగ్ సజావుగా జరిగేలా చూడాలని కలెక్టర్‌ను కోరామన్నారు. ఎప్పుడూ లేనివిధంగా ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్లు వేశారని, బ్యాలెట్‌పై స్టాంప్ లేదని, సంతకాలు లేవని వైసిపి ఏజెంట్లు అభ్యంతరాలు పెట్టే అవకాశం ఉందన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా పోస్టల్ బ్యాలెట్ల కౌంటింగ్, నిర్ణీత సమయంలోపు పూర్తి చేయాలన్నారు. స్వతంత్ర అభ్యర్థులకు ఏజెంట్లను అనుమతించాలని కలెక్టర్‌ను కోరామని, ఆయా నియోజకవర్గాలకు కేటాయించిన కౌంటింగ్ కేంద్రాలలో స్థలం తక్కువగా ఉండటంతో నిలబడి ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. కౌంటింగ్ సందర్భంగా ఏజెంట్లు గా ఎవరినైనా పెట్టుకోవటానికి ఎన్నికల కమిషన్ అనుమతి ఇచ్చిందని, లోకల్, నాన్ లోకల్ సమస్య అంటూ వైసిపి నాయకులు అభ్యంతరాలు చెప్పే అవకాశం ఉందన్నారు. ఏజెంట్లు ఎవరినైనా నియమించుకోవచ్చని, ఎవరైనా అభ్యంతరాలు చెప్పినా, గొడవలు సృష్టించాలని ప్రయత్నించినా బయటకు పంపుతామని కలెక్టర్ హామీ ఇచ్చారన్నారు. కౌంటింగ్ సందర్భంగా జిల్లాలో ఏ ప్రాంతంలో ఇబ్బందులు లేకుండా గొడవలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు దామచర్ల జనార్దనరావు తెలియజేశారు. కార్యక్రమంలో సంతనూతలపాడు నియోజకవర్గ అభ్యర్థి బిఎన్ విజయ్‌కుమార్, దర్శి నియోజకవర్గ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి భర్త డాక్టర్ కడియాల లలిత్‌కుమార్, టిడిపి నాయకులు పెద్దిరెడ్డి సూర్యప్రకాశ్‌రెడ్డి, ఈదర మోహన్, కొఠారి నాగేశ్వరరావు, కూటమి నేతలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలి..

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఈ నెల 5న సందర్భంగా జిల్లాలోని ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలని పర్యావరణ పరిరక్షణ సంస్థ చైర్మన్ జి.వీరభద్రాచారి పిలుపునిచ్చారు. ఆదివారం సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండుతున్న ఎండలకు కంగారు పడుతున్న ప్రజలు.. దీనికి కారణంగా అడవుల నరికివేతే అని తెలిసినా మౌనం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న వాయు, నీటి, వాతావరణ కాలుష్యంతో పాటుగా ఆహార కల్తీ ప్రజలను దీర్ఘకాలిక, ఆకస్మిక అనారోగ్యాలకు గురిచేస్తూ ప్రాణాలను హరించి వేస్తుందన్నారు. అందులో భాగంగా ప్రతి ఒక్కరూ వారి ఇంటి, ఊరి పరిసరాల్లో ఈ నెల 5న ఒక మొక్కను నాటి సంరక్షించాలన్నారు. తద్వారా స్వచ్ఛమైన ఆక్సిజన్ అందుతుందని, ఇందు కోసం గ్రామాలలో సర్పంచ్, ఎంపిటిసి, జడ్పిటిసి, పట్టణాలలో కౌన్సిలర్, కార్పొరేటర్లు బాధ్యత వహించాలని వీరభద్రాచారి విజ్ఞప్తి చేశారు. ఈ నెల 5న సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ సంస్థ ప్రతినిధులు అమన్, అజయ్ భువన, కత్తి శివ, పి.మోజెస్ పాల్గొన్నారు.

కౌంటింగ్ సెంటర్‌లోకి వెళ్లే వారిని..

క్షుణ్ణంగా తనిఖీ చేయాలి..

- నిబంధనలు మీరితే కఠినచర్యలు - ఎస్పీ వకుల్‌జిందాల్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పోలీస్ అధికారులు, సిబ్బంది ఒకరికొకరు సమన్వయంతో వ్యవహరిస్తూ సమర్ధవంతంగా విధులు నిర్వహిస్తూ.. ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ ప్రక్రియ జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ పోలీస్ అధికారులకు తెలిపారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రాల వద్ద, చెకింగ్ పాయింట్లలో, పార్కింగ్ ప్రదేశాలలో విధులు నిర్వహించనున్న పోలీసు అధికారులతో క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎస్పీ సమావేశం నిర్వహించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా, ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా నిర్వహించవలసిన విధులు గురించి దిశానిర్దేశం చేశారు.

ఎస్పీ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ కోసం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని బ్యారికేడింగ్, క్యూలైన్లు, స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు, కంట్రోల్ రూమ్ ఏర్పాటు పూర్తయ్యాయన్నారు. కౌంటింగ్ రోజున బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల లోపల, పరిసర ప్రాంతాలలో, పార్కింగ్ ప్రదేశాలలో విధులు నిర్వహించే పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. కౌంటింగ్ సెంటర్‌కు 200 మీటర్ల బయట వాహనాలని తనిఖీ చేసి పంపాలని, 100 మీటర్ల బయట అభ్యర్థులని, ఏజెంట్లని, విధులు నిర్వహించడానికి వచ్చే ప్రభుత్వ ఉద్యోగులను క్షుణ్ణంగా తనిఖీ చేసి, వారి గుర్తింపు కార్డులను పరిశీలించి పంపాలన్నారు. లోపలికి వచ్చిన వారిని వారికి కేటాయించిన క్యూలైన్ల ద్వారానే లోపలికి పంపించాలని, కౌంటింగ్ సెంటర్ లోపలికి ప్రవేశించే ద్వారం దగ్గర మరోసారి క్షుణ్ణంగా తనిఖీ చేయాలని చెప్పారు. కౌంటింగ్ కేంద్రాలలో నిబంధనలకు విరుద్ధంగా కవ్వింపు చర్యలకు, ఘర్షణలకు ఎవరైనా పాల్పడితే వెంటనే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. వివిధ పార్టీల అభ్యర్థులకు, ఏజెంట్లకు, ఉద్యోగస్తులకు వేరు వేరుగా పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఎవరికి సూచించిన ప్రదేశాలలో వారికి సంబంధించిన వాహనాలను వరుస క్రమంలో పార్కింగ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పార్కింగ్ ప్రదేశంలో ఉండే వాహనాలలో ఆ వాహనాలకు సంబంధించిన డ్రైవర్లు మాత్రమే ఉండాలన్నారు.

ఆదివారం..ఆహ్లాదం..

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మండుతున్న ఎండలు, ఉక్కపోతలతో అల్లాడిపోతున్న ప్రజలు వాడరేవు సముద్ర తీరానికి చేరుకొని ఆదివారం ఆహ్లాదంగా గడిపారు. 40 డిగ్రీలు దాటిన ఎండలతో కొన్ని రోజులుగా ప్రజలు అల్లాడిపోతున్నారు. ఇంటి నుంచి బయటకు రావాలంటేనే ప్రజలు బెంబేలెత్తిపోయారు. చంటి పిల్లలు, వద్ధులు అయితే ఎండ వేడిని తట్టుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఈ సమయంలో ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో వాడరేవు తీరానికి పర్యాటకులు చేరుకొని సందడి చేశారు. కుటుంబసభ్యులతో కలిసి.. బీచ్‌లో కేరింతలు కొట్టారు.



తీరంలో సందడి చేస్తున్న చిన్నారులు, మహిళలు

రైతుల అభ్యున్నతికి కృషి

- బిందు సేద్యం లక్ష్యాల సాధనకు చర్యలు
- ఎపిఎంఐపి పీడీ పివి.రమణ వెల్లడి



ముఖాముఖి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో రైతాంగ అభ్యున్నతికి కృషి చేస్తున్నామని, వ్యవసాయ భూములకు సాగునీటి వసతులు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటిపారుదల ప్రాజెక్ట్ (ఎపిఎంఐపి) పథక సంచాలకులు పివి రమణ తెలిపారు. డ్రిప్, స్ప్రింక్లర్ల ద్వారా బిందు సేద్యం అమలుకు కృషి చేస్తున్నామన్నారు. 16 మండలాల్లో నీటి నిల్వల లభ్యత తక్కువగా ఉండటంతో వాటిపై దృష్టి సారించామన్నారు. పలు నియోజకవర్గాలలో తక్కువ నమోదవుతున్న సాగును పెంచేందుకు చర్యలు చేపట్టామన్నారు. రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాల పంపిణీకి సబ్సిడీ, 20 కంపెనీలకు చెందిన పరికరాలను రైతులకు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను 100 శాతం సాధిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటిపారుదల పథకం ద్వారా రైతులకు అందిస్తున్న సేవలు, రాయితీల వివరాలను పథక సంచాలకులు 'ప్రజాశక్తి'కి వివరించారు. ఆ వివరాలన్నీ ఆయన మాటల్లోనే..

ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటిపారుదల పథకాన్ని జిల్లాలో 2002 నుంచి అమలు చేస్తున్నాం. ఎపిఎంఐపి జిల్లా ఛైర్మన్, కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లాలో సాగునీటి వనరుల పెంపుదలకు సమగ్ర ప్రణాళికతో ముందుకెళుతున్నాం. 2002 నుంచి 2022-23 ఆర్థిక సంవత్సరం వరకు 88,349 హెక్టార్లు సాగులోకి వచ్చాయి. 1,19,858 హెక్టార్ల అనువైన వ్యవసాయ భూములు అందుబాటులో ఉన్నాయి 2023-24 ఆర్థిక సంవత్సరానికి 10,000 హెక్టార్ల బిందు సేద్యం లక్ష్యం కాగా 9543.31 హెక్టార్లు సాగైంది. దీంతో 95.43 సాధు శాతం నమోదైంది. ఇందుకు మొత్తం 105.24 కోట్లు ఖర్చు కాగా రైతుల వాటా రూ.15.34 కోట్లు, సబ్సిడీ రూ.84.89 కోట్లు రైతులకు అందించాం. 9536,7 హెక్టార్లకు 8,444 మంది రైతులకు పరికరాలు అందజేశాం. పథకంలో ఒకసారి రాయితీ పొందిన రైతు మళ్లీ ఏడు సంవత్సరాల వరకు సబ్సిడీ పొందటానికి అవకాశం లేదు.

పథకంలో 20 కంపెనీల భాగస్వామ్యం

ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటిపారుదల పథకం అమలులో 20 కంపెనీలు భాగస్వాములయ్యారు. వీరు ఫైయిన్ లాటరల్స్, ఎమిట్టింగ్ పైప్, హెచ్‌డిపిఇ పైప్, డిపుర్స్, పివిసి పైప్స్, పిపిసి బాల్ వాల్వ్ వంటివి బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బిఐఎస్) ప్రమాణాలకు అనుగుణంగా రైతులకు సరఫరా చేయాల్సి ఉంది. ఆయా కంపెనీలు సరఫరా చేసిన పరికరాలపై జిల్లాల్లో ర్యాండమ్‌గా శాంపిల్స్ తీసుకుంటాం. కొన్ని కంపెనీలు క్యూఆర్ కోడ్ కూడా నమోదుచేయటంతో అక్రమాలకు ఆస్కారం లేకుండా పోతోంది. ప్రాథమిక, తుది దశలలో రైతులు ఏర్పాటు చేసే పరికరాలపై మూడు చోట్ల ఫోటోలు తీసి పార్మర్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తున్నాం. ఆయా కంపెనీలు రైతులకు 3 సంవత్సరాల వరకు సర్వీస్‌ను ఉచితంగా చేస్తారు. స్పేర్ పార్ట్ చెడిపోతే రైతు కొనుగోలు చేయాల్సి ఉంది. 5 ఎకరాల లోపు రైతులకు 90 శాతం సబ్సిడీ, 5 ఎకరాలు దాటిన రైతులకు 70 శాతం సబ్సిడీ ఇస్తున్నాం..

సమస్యల పరిష్కారానికి చర్యలు

రైతులు బిందు సేద్యంలో ఏమైనా సమస్యలు ఉంటే వారిని రెండు పద్ధతులలో పరిష్కరిస్తున్నాం. హెచ్‌ఆర్ రిక్వెస్ట్ ట్రాకింగ్ సిస్టమ్, కాల్ సెంటర్ టోల్ ఫ్రీ నెంబర్ 1800-42529608 రైతులు సమస్యలను తెలియజేయవచ్చు.

ప్రతి వారం 14 చోట్ల శిక్షణా కార్యక్రమాలు

జిల్లాలో ప్రతి బుధ, గురువారాలలో రైతులకు శిక్షణా కార్యక్రమాలు ఇస్తున్నాం. ప్రతి వారం 14 చోట్ల ఇవి జరుగుతున్నాయి. ఇందులో రైతులు, ఎపిఎంఐపి ఎంఐ ఇంజినీర్, మార్కాపురంలోని ఎంఐడిసి, ఆయా కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారు. డ్రిప్, స్ప్రింక్లర్ల మెయింటెన్స్, వాటి ఉపయోగాలు, ఎరువుల వినియోగించే విధానంపై అవగాహన కల్పించటం జరుగుతోంది. ఇటీవల కేంద్ర బృందం త్రిపురాంతకం, దేవరాజు గట్టు ప్రాంతాలలో పర్యటనకు వచ్చిన సందర్భంలో రైతులు సబ్సిడీ పొందితే తరువాత మళ్లీ 7 సంవత్సరాల వరకు రాదని, దీనిని 5 సంవత్సరాలకు తగ్గించాలని కోరారు.